ప్రతిపక్షం

www.prathipaksham.in

సోమవారం 02.03.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 341 పేజీలు:10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



వెస్టిండీస్ పై విజయం.. సెమీస్ కు భారత్ 10



రాష్ట్రంలో కాంగ్రెస్ బుల్డోజర్ రాజ్యం

- మూసీ పేరుతో కాంగ్రెస్ భారీ స్కామ్
- ఇందుకు పేదల ఇండ్లు పణంగా పెడుతున్నారు
- రెండేళ్లు మీ భూములను కాపాడుకోండి
- మూసీ కోసం భూములు, ఇళ్లు పోకుండా చూస్తా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మూసీ బాధితులకు సంఘీభావం

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 1 : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ బుల్డోజర్ రాజ్యం నడుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఒకవైపు దేశంలో బీజేపీ బుల్డోజర్ రాజ్యం చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీతో పాటు మిగిలిన నేతలంతా చెబుతున్నారని తెలిపారు. కానీ తెలంగాణలో జరుగుతున్న ఈ బుల్డోజర్ రాజ్యాన్ని, దాని అరాచకాలను మాత్రం ఆపకుండా మౌనంగా ఉంటున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో మూసీ ప్రాజెక్టులో భాగంగా పెద్ద ఎత్తున తమ ఇళ్లను, భూములను, అపార్ట్‌మెంట్లను కోల్పోతున్న రాజేంద్రనగర్ ప్రాంతంలోని హైదర్ షా కోట్, మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ బాధితులను కేటీఆర్ కలిసి వారికి సంఘీభావం తెలిపారు. ఒక్క రెండు సంవత్సరాల పాటు మూసీ బాధితులు తమ భూములను, అపార్ట్‌మెంట్లను కాపాడుకునేందుకు ప్రయత్నం చేయాలని, ఈ పోరాటంలో భారత రాష్ట్ర సమితి వారికి అండగా ఉంటుందని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూసీ కోసం ఎవరి భూములు, ఇళ్లు పోకుండా చూస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్

...:: మిగతా 2లో

ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి



ధ్రువీకరించిన ఇరాన్ మీడియా

- కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటాం
- ఇజ్రాయెల్, అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ భారీ ఆపరేషన్
- ఇరాన్ కొత్త లీడర్.. అయతుల్లా అలీరెజా అరాఫీ
- ఇరాన్ కొత్త నాయకత్వంతో చర్చలకు సిద్ధం
- ప్రతీకారానికి దిగకపోవడమే మంచిది: ట్రంప్
- ఇరాన్‌పై దాడులు కొనసాగిస్తాం: ఇజ్రాయెల్

ప్రతిపక్షం నేషనల్ డెస్క్

పశ్చిమాసియా నెత్తురోడుతోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుతో వందలాది మంది అమాయకులు బలవుతున్నారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయాతుల్లా అలీ ఖమేనీ మృతి చెందినట్లు ఇరాన్ అధికారిక మీడియా ధ్రువీకరించింది. ఖమేనీతో పాటు ఆయన కుటుంబ సభ్యులు కుమార్తె, అల్లుడు, కోడలు, మనవరాలు మరణించనట్లు వివరాలను వెల్లడించింది. ఖమేనీ మృతి 40 రోజుల సంతాప దినాలను ప్రకటించింది. కాగా, పశ్చిమాసియా మళ్లీ భగ్గుమన్నది. ఇరాన్‌తో అణు ఒప్పందంపై ప్రతిష్ఠంభన కొనసాగుతున్న వేళ ఆ దేశంపై అమెరికా ఇజ్రాయెల్

...:: మిగతా 2లో

ఇరాన్ కొత్త లీడర్.. అయతుల్లా అలీరెజా అరాఫీ..

...:: 9లో



కళలు తెలంగాణ రాష్ట్రం ఆత్మ



- కళలు, సంస్కృతికి ప్రభుత్వం పెద్దపీట
- దేవాలయాలు, టూరిజం, కల్చర్ తో కూడిన యాక్షన్ ప్లాన్
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఎల్బీ స్టేడియంలో ఘనంగా రామదాసు జయంతి ఉత్సవాలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 1: కళలు తెలంగాణ రాష్ట్రం ఆత్మ అని, కళలు, సంస్కృతికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ లోని ఎల్బీ ఇండోర్ స్టేడియంలో రామదాసు జయంతి ఉత్సవాలలో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ నేల గర్వించదగ్గ గొప్ప వాగ్గేయకారుడు, భద్రాచల రామదాసు అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కొనియాడారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలోని కళాకారులకు, సాంస్కృతిక వైభవానికి పూర్వ వైభవం తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. గత రెండు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం సాధించిన అనేక విజయాలను

...:: మిగతా 2లో

ఇరాన్, గల్ఫ్ ప్రాంతాల్లో ఉన్న తెలుగు ప్రజలందరూ

అప్రమత్తంగా ఉండాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో



హైదరాబాద్, మార్చి 1: ఇరాన్, ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాల్లోని తెలుగు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలు పాటించాలని రేవంత్ రెడ్డి తెలిపారు. అత్యవసర పరిస్థితి ఎదురైతే తప్ప తెలుగు ప్రజలు ఎవరూ బయటకు రావొద్దని సూచించారు. తెలుగువారిని రప్పించేందుకు కేంద్రంతో రాష్ట్రం సమన్వయం చేసుకుంటుందన్న ఆయన ఇరాన్, గల్ఫ్ దేశాల్లోని రాష్ట్ర ప్రజల పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పరిశీలిస్తుందని పేర్కొన్నారు. అవసరమైతే

...:: మిగతా 2లో



నాగ్‌పూర్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు

- 17 మంది కార్మికులు మృతి.. 18 మందికి గాయాలు
- ఆదివారం తెల్లవారుజామున ఘటన
- డిటోనేటర్ ప్యాకింగ్ యూనిట్‌లో విస్ఫోటనం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

నాగర్‌పూర్, మార్చి 1: మహారాష్ట్రలో ఘోర విషాదం చోటుచేసుకుంది. నాగ్‌పూర్ జిల్లాలోని పేలుడు పదార్థాల తయారీ కర్మాగారంలో భారీ పేలుడు సంభవించి 17 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరో 18 మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జిల్లాలోని కాటోల్ తహసీల్ పరిధిలోని రౌల్‌గావ్ గ్రామంలో ఉన్న ఎస్‌బీఎల్ ఎనర్జీ లిమిటెడ్ పేలుడు పదార్థాల తయారీ యూనిట్‌లో ఆదివారం తెల్లవారుజామున ఘటన జరిగింది. ఉదయం 7 నుంచి 7.15 గంటల మధ్య డిటోనేటర్ ప్యాకింగ్ యూనిట్‌లో

...:: మిగతా 2లో

నేడు తెలంగాణలో రాహుల్ పర్యటన



- డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతులకు హాజరు
- తాజా రాజకీయ పరిణామాలు, రాజ్యసభ సభ్యుల ఎంపికపై చర్చ!
- మాజీ మావోయిస్టు అగ్రనేతలతో రాహుల్ సమావేశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 1: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సోమవారం తెలంగాణ రాష్ట్రానికి వస్తున్నారు. వికారాబాద్ లో జరుగుతున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతులకు ఆయన హాజరవుతారు. ఉదయం 9 గంటల 20 నిమిషాలకు

...:: మిగతా 2లో



అసమానతలు ఉన్నంత కాలం

మార్క్సిజం ఉంటుంది

- కొత్త రూపంలో పోరాటాలు పుట్టుకొస్తాయి
- విప్లవోద్యమం ఎప్పుడూ అంతం కాదు
- ప్రజలే చరిత్ర నిర్మాతలు
- మాజీ మావోయిస్టు నేత బండి ప్రకాశ్
- ప్రకాశ్, అప్పాచి నారాయణ ఆత్మీయ సమ్మేళనం

ప్రతిపక్షం ప్రతినిధి

మంచిర్యాల, మార్చి 1: సమాజంలో దోపిడి, పీడన అసమానతలు ఉన్నంత కాలం మార్క్సిజం, మావోయిజం, లెనినిజం ఉంటుందని, అవి ఎప్పుడు కనుమరుగవుతాయో అప్పుడు వీటితో పని ఉండదని తెలంగాణ మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు సింగరేణి కార్మిక సమాఖ్య (సికాసా) మాజీ కార్యదర్శి బండి ప్రకాశ్ అన్నారు. విప్లవోద్యమంలో పని చేసినందునే నాకు ఈ రోజు గుర్తింపు వచ్చిందని, లేకపోతే సమాజంలో నేను ఒక బండి ప్రకాశ్‌ను మాత్రమేనని అన్నారు. బతికున్నంతకాలం విప్లవోద్యమానికి రుణపడి ఉంటానని తెలిపారు. ఆదివారం స్థానిక సీఈఆర్ క్లబ్‌లో బండి ప్రకాశ్ మిత్రుల ఆధ్వర్యంలో నిర్వహించిన బండి ప్రకాశ్ దంపతులు, అప్పాచి నారాయణ దంపతుల

...:: మిగతా 2లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్- 6.28 (సోమవారం సాయంత్రం)

సహర్- 5.11 (మంగళవారం ఉదయం)



డీఎంకే అధికార కల.. పీడకలే

తమిళనాడులో ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార డీఎంకేపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. తిరిగి అధికారంలోకి వస్తామని చెబుతున్న డీఎంకేకు అది పీడకలగానే మిగిలిపోతుందని ఎద్దేవా చేశారు.

9



ఖమేని హత్యను ఖండించిన పుతిన్

ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ హత్యను రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఖండించారు. ఖమేనీ హత్య నిరంకుశ చర్యగా అభివర్ణించారు. ఈ మేరకు ఆదివారం పుతిన్ ఒక ప్రకటన విడుదల చేశారు.

9



మోదీ సర్కారు వల్లే భారత్ మూల్యం

మోదీ సర్కారు విదేశాంగ విధానం విఫలమవుతున్నందుకు, మన దేశం భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వస్తోందని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. ఇజ్రాయెల్‌లో పర్యటించి ప్రధాని మోదీ పెద్ద తప్పు చేశారని హస్తం పార్టీ మండిపడింది.

9

రాష్ట్రీయం

రాష్ట్రంలో కాంగ్రెస్ బుల్డోజర్ రాజ్యం

మొదటిపేజీ తరువాయి

బుల్డోజర్ రాజ్యం నడుస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. ఒకవైపు దేశంలో బీజేపీ బుల్డోజర్ రాజ్యం చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీతో పాటు మిగిలిన నేతలంతా చెబుతున్నారని తెలిపారు. కానీ తెలంగాణలో జరుగుతున్న ఈ బుల్డోజర్ రాజ్యాన్ని, దాని అరాచకాలను మాత్రం ఆపకుండా మౌనంగా ఉంటున్నారని విమర్శించారు. ఒకవైపు బుల్డోజర్ రాజ్యంపై విమర్శలు చేస్తూ, ఇక్కడ రేవంత్ రెడ్డి చేస్తున్న బుల్డోజర్ అరాచకాలను కేవలం రేవంత్ పంపిస్తున్న సంచుల కట్టల కోసం చూడనట్లు వదిలేస్తున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి తెలిసిన పాలన కేవలం ఇళ్లను కూలగొట్టడం, భూములు ఆక్రమించడం, రియల్ ఎస్టేట్ దందా చేయడం, దానికోసం పేదల జీవితాలను పూర్తిగా నాశనం చేయడమేనని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ప్రజల ఇళ్లను కూలగొట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడమే తన పనిగా పెట్టుకున్నారని కేటీఆర్ అన్నారు. తెలంగాణ వచ్చినప్పటి నుంచి ఒక్క ప్రాజెక్టు గాని, ఒక్క ఇల్లు గాని, ఒక్క రోడ్డు గాని వేయకుండా కేవలం విధ్వంసమే తన విధానంగా పెట్టుకుని ముందుకు పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ బాధితుల కోసం వారు నిర్వహించిన 'మూసీ దండి మార్చ్' పాదయాత్రలో మూడున్నర కిలోమీటర్ల పాటు అనేకమంది బాధితులను కలుస్తూ కేటీఆర్ ముందుకు సాగారు. ఆ తర్వాత మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ దగ్గర జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఒక్క రెండు సంవత్సరాల పాటు మూసీ బాధితులు తమ భూములను, అపార్ట్‌మెంట్లను కాపాడుకునేందుకు ప్రయత్నం చేయాలని, ఈ పోరాటంలో భారత రాష్ట్ర సమితి వారికి అండగా ఉంటుందని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూసీ కోసం ఎవరి భూములు, ఇళ్లు పోకుండా చూస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

మూసీ పేరుతో భారీ స్కామ్

కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారాల కోసం తన అనుచరులకు, అన్నదమ్ములకు, కుటుంబ సభ్యులకు కాంట్రాక్టులు ఇవ్వడం కోసం మూసీ పేరుతో భారీ స్కామ్‌కు తెరలేపారని, ఇందుకోసం పేదల ఇళ్లను పణంగా పెడుతున్నారని కేటీఆర్ అన్నారు. గతంలో మా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేవలం 16 వేల కోట్ల రూపాయలతోనే మూసీ సుందరీకరణ కార్యక్రమానికి ఒక్క ఇల్లు కూడా పోకుండా డీపీఆర్ సిద్ధం చేశామని కేటీఆర్ తెలిపారు. కేవలం సుందరీకరణ మాత్రమే కాకుండా రోడ్లతో పాటు ఫ్లైఓవర్లను కూడా మా ప్రణాళికలో ఉంచామని, కానీ ఎక్కడా కూడా ఒక్క ఇల్లుకు ఇబ్బంది కాకుండా చూశామన్నారు. అలాంటి అంశాన్ని పక్కన పెట్టి లక్షన్నర కోట్ల రూపాయల దోపిడీ కోసం వేల మంది ఇళ్లను ధ్వంసం చేస్తూ రేవంత్ రెడ్డి కొత్త స్కామ్‌కు తెరలేపారని విమర్శించారు. మరోవైపు మూసీలో ఇళ్లు ఉన్నాయని అబద్ధాలు చెబుతూ ధ్వంసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, తమ సొంత మంత్రులు, ప్రజా ప్రతినిధులకు ఉన్న ఫామ్‌హౌస్‌లు, విల్లాలు, ఇళ్లను ఎందుకు ముట్టుకోవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని ఒక రియల్ ఎస్టేట్ బ్రోకర్ నడుపుతున్నాడని, అందుకే ఇన్ని రకాల ఇబ్బందులు వస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న బెదిరింపులకు, ఇళ్లకు బదులు డబ్బులు ఇస్తామని మోసం చేసే ప్రయత్నాలకు లొంగకుండా ఐక్యంగా ముందుకు సాగాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

ఇరాన్, గల్ఫ్ ప్రాంతాల్లో ఉన్న తెలుగు ప్రజలందరూ

అప్రమత్తంగా ఉండాలి

మొదటిపేజీ తరువాయి

కేంద్రంతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటామన్నారు. భారత ఎంబసీలు, కాన్సులేట్‌తోనూ సంప్రదింపులు జరపాలని కోరారు. రాష్ట్రప్రజల భద్రతే రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలు పాటించాలని సూచనపశ్చిమాసియా దేశాల్లో నెలకొన్ని ఉద్రిక్త పరిస్థితుల్లో ఇరాన్, ఇజ్రాయెల్ ప్రాంతాల్లో ఉన్న తెలుగు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. భద్రతా మార్గదర్శకాలను పాటించాలని తెలుగు ప్రజలను కోరారు.

కళలు తెలంగాణ రాష్ట్రం ఆత్మ

మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర అభివృద్ధి గురించి సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలతో ప్రజలకు వివరించారు, ఆ కళారూపాల్లో ప్రజలు పాల్గొనడమే కాదు ప్రజలు స్పందించిన తీరు తనకు వ్యక్తిగతంగా తెలిసిన వ్యక్తిగా భవిష్యత్తులో సంగీత నాటక అకాడమీ విరివిగా కార్యక్రమాలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తూ ముందుంటుందని, అవసరమైన ఆర్థిక అవసరాలను తీరుస్తామని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. నేలకొండపల్లిలో జన్మించిన గోపన్న తన భక్తితో, కీర్తనలతో భక్త రామదాసుగా చిరస్థాయిగా నిలిచిపోయారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కొనియాడారు. ఆయన కట్టిన భద్రాచలం ఆలయం, రాసిన కీర్తనలు ప్రతి తెలుగువారి గుండెల్లో నిలిచిపోయాయని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత మన ప్రాంత వాగ్గేయకారుల గొప్పతనాన్ని చాటిచెప్పేలా ఇటువంటి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. చైతన్యానికి కళలే ఆయువుపట్టని అన్నారు. తెలంగాణ గ్రామాల్లోని ప్రతి సమస్యకు కళారూపాల ద్వారానే పరిష్కారాన్ని, చైతన్యాన్ని తీసుకువచ్చిన చరిత్ర మనదని డిప్యూటీ సీఎం గుర్తుచేశారు. కేవలం వినోదం కోసమే కాకుండా, ప్రజలను జాగృతం చేసేందుకు కళలు దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప వంటి ప్రపంచ వారసత్వ కట్టడాలు, రాష్ట్రంలోని పురాతన ఆలయాలను కలుపుతూ.. పర్యాటకం, సంస్కృతి మేళవించిన ఒక ప్రత్యేక 'యాక్షన్ ప్లాన్' సిద్ధం చేయాలని సంగీత నాటక అకాడమీని ఆయన ఆదేశించారు. కళల పట్ల ప్రజలకు ఉన్న మక్కువ చూస్తుంటే సంతోషంగా ఉందని, భవిష్యత్తులో ఇటువంటి కార్యక్రమాలకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తామని భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు.

నేడు తెలంగాణలో రాహుల్ పర్యటన

మొదటిపేజీ తరువాయి

శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోనున్న ఆయన అక్కడ నుంచి హెలికాప్టర్ లో వికారాబాద్ చేరుకుంటారు. ఉదయం 10.30 నుంచి నాలుగున్నర వరకు అక్కడి హరిత రిసార్ట్ లోనే ఉంటారు. ఈ సమావేశంలో తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం తదితర అంశాలతో డీసీసీ అధ్యక్షులకు రాహుల్ గాంధీ దిశా నిర్దేశనం చేయనున్నారు. రాజ్యసభ సభ్యుల ఎంపికపై చర్చించనున్నట్లుగా సమాచారం. ఇటీవల వనం వీడి జనంలోకి వచ్చిన మాజీ మావోయిస్టు అగ్రనేతలతో రాహుల్ గాంధీ సమావేశం అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. సాయంత్రం 5 గంటలకు తిరిగి ఢిల్లీ బయలుదేరనున్నారు. మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన జరిగే పీఏసీ సమావేశానికి రాహుల్ గాంధీ హాజరవ్వనున్నట్లుగా తెలుస్తోంది. రాహుల్ గాంధీ పర్యటన నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు భారీ ఏర్పాట్లు చేశారు. ఏపీ, తెలంగాణ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం హాజరుకానున్నారు. ఉదయం 9.30 గంటలకు శంషాబాద్ విమానాశ్రయంలో రాహుల్ గాంధీకి ముఖ్యమంత్రి స్వాగతం పలుకనున్నారు. అనంతరం రాహుల్ గాంధీతో కలిసి శంషాబాద్ నుంచి నేరుగా వికారాబాద్ కు హెలికాప్టర్ లో వెళ్తారు



అణు ఒప్పందానికి అతి చేరువలో ఉండగా అమెరికా దాడులు చేసింది. చర్చలు జరుగుతుండగానే దాడులు చేసి దౌత్యాన్ని ట్రంప్ నాశనం చేశారు. చివరగా జెనీవాలో చర్చలు జరిగాక వచ్చే సమావేశంలో ఈ డీల్ ఖాయం చేసుకోవాలని అనుకున్నాం.

- ఇరాన్ విదేశాంగ మంత్రి సయిద్ అబ్బాస్ అరాఘ్చి

నాగర్‌పూర్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు

మొదటిపేజీ తరువాయి

ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించినట్లు అధికారులు తెలిపారు. పేలుడు తీవ్రత ఎంత ఎక్కువగా ఉందంటే, ఫ్యాక్టరీ భవనం పూర్తిగా ధ్వంసమై శిథిలాలు సుమారు 500 నుంచి 700 మీటర్ల దూరం వరకూ ఎగిరి పడింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. పేలుడు తర్వాత అక్కడ భారీ అగ్ని ప్రమాదం కూడా చెలరేగింది. మంటలు ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది సుమారు నాలుగు గంటల పాటు తీవ్రంగా శ్రమించారు. అనంతరం మంటలను అదుపులోకి తెచ్చి సహాయక చర్యలను వేగవంతం చేశారు. పోలీసుల ప్రకారం, ఘటనాస్థలంలో పనిచేస్తున్న కార్మికుల్లో 17 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళా కార్మికులే ఉన్నట్లు తెలుస్తోంది. మరో 18 మంది తీవ్ర గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారిని తక్షణమే నాగ్‌పుర్ నగరంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.ప్రమాదం జరిగిన వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్, పోలీసు సూపరింటెండెంట్ హర్ష్ పొద్దార్



సహా ఉన్నతాధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సహాయక చర్యలకు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి శిథిలాల మధ్య చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు చర్యలు చేపట్టాయి. అదేవిధంగా పేలుడు పదార్థాల భద్రతను పర్యవేక్షించే సంబంధిత విభాగాల బృందాలు కూడా ఘటనాస్థలానికి చేరుకున్నాయి. ఆ ఫ్యాక్టరీలో గనుల పరిశ్రమలు, మౌలిక వసతుల ప్రాజెక్టుల కోసం అవసరమైన పారిశ్రామిక పేలుళ్లు, డిటోనేటర్లు, అనుబంధ ఉత్పత్తులు తయారు చేస్తారు. డిటోనేటర్ ప్యాకింగ్ యూనిట్‌లో ఏదైనా సాంకేతిక లోపం లేదా నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. అయితే అసలు కారణం ఏమిటన్నది దర్యాప్తు అనంతరం స్పష్టమవుతుందని తెలిపారు.

ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి

మొదటిపేజీ తరువాయి



దళాలు శనివారం ఉదయం అనూహ్యంగా దాడికి దిగాయి. రాజధాని నగరం టెహ్రాన్‌కు ఉత్తరాన ఉన్న 30 ప్రాంతాలే లక్ష్యంగా ఈ క్షిపణి దాడులు జరిగాయి. దీంతో టెహ్రాన్ అంతటా పేలుడు శబ్దాలు వినిపించాయి. దక్షిణ ఇరాన్‌లోని ఓ బాలికల పాఠశాలపై జరిగిన బాంబు దాడిలో 85 మంది విద్యార్థులు మృత్యువాతపడ్డారు. మొత్తంగా దాడుల్లో 200 మంది మృతిచెందినట్టు సమాచారం. అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన సంయుక్త దాడుల్లో ఇరాన్ ఆర్మీ చీఫ్, ఆ దేశ రక్షణ మంత్రి అమీర్ మరణించినట్టు ఇజ్రాయెల్ తెలిపింది. తమ సైనిక చర్యను 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'గా అమెరికా రక్షణ శాఖ కార్యాలయం పెంటగాన్ పేర్కొన్నది. ఇజ్రాయెల్ దాడులను 'ఆపరేషన్ రోరింగ్ లయన్'గా ఆ దేశ ప్రధాని నెతన్యాహు పేర్కొన్నారు. తమపై దాడులకు ప్రతీకారంగా ఇరాన్ సైతం ఇజ్రాయెల్, అమెరికా స్థావరాలపై విరుచుకుపడింది.

ఖమేనీ మృతికి ప్రతీకారం తీర్చుకుంటాం..

సుప్రీం లీడర్ ఖమేనీ మృతికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన భీకర దాడులపై తీవ్రంగా స్పందించింది. దాడులకు పాల్పడిన వారిపై కచ్చితంగా బదులు తీర్చుకుంటామని హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ కేబినెట్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఖమేనీ మృతిపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ సంతాపం తెలిపింది. తమ సుప్రీం నేతను చంపిన వారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించింది. చరిత్రలో ఎన్నడూ చూడని భయంకరమైన దాడులు జరగవచ్చని తెలిపింది. కాగా ఇజ్రాయెల్, అమెరికా స్థావరాలే లక్ష్యంగా భారీ ఆపరేషన్ చేపట్టేందుకు ఐఆర్‌జీసీ సిద్ధమైనట్లు ఇరాన్ మీడియా వెల్లడించింది. ఖమేనీ మృతి అనంతరం గంటల వ్యవధిలోనే పశ్చిమాసియాలోని 27 అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్‌కుచెందిన ఐఆర్‌జీసీ దళాలు క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేపట్టాయి. అలాగే ఇజ్రాయెల్‌పై కూడా క్షిపణులతో విరుచుకుపడుతోంది. దుబాయి, దోహాలోని యూఎస్ స్థావరాలు, లెబనాన్‌లోని అమెరికా ఎంబసీపైనా దాడులు చేసింది. మొత్తం 27 అమెరికా బేస్‌లను లక్ష్యంగా చేసుకున్నట్లు ఇరాన్ వెల్లడించింది. అందులో ఇజ్రాయెల్‌లోని టెల్ నోఫ్ ఎయిర్ బేస్, ఇజ్రాయెల్ ఆర్మీ ప్రధాన కార్యాలయం హాకిర్యా కూడా ఉన్నాయి. అదేవిధంగా ఇజ్రాయెల్‌లోని రక్షణరంగ ఫ్యాక్టరీలను కూడా ఇరాన్ టార్గెట్ చేసుకుంది. ఖతార్ గగనతలం ఆదివారం ఉదయం 7.30 సమయంలో పేలుళ్లతో దద్దరిల్లింది. దాని రాజధాని దోహాలో మొత్తం 11 పేలుళ్లు జరిగాయి. మరోవైపు ఇజ్రాయెల్ వ్యాప్తంగా సైరన్లు మోగుతూనే ఉన్నాయి. దుబాయ్‌లో ఉదయం 8.15 గంటల సమయంలో మూడు భారీ పేలుళ్లు సంభవించాయి. ఇరాన్ ప్రయోగించిన ఆయుధాలను ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు గగనతలంలోనే పేల్చివేశాయి. శకలాలు కూలడంతో దుబాయ్‌లో అత్యంత రద్దీగా ఉండే జబిల్ అలీ పోర్టులో భారీగా మంటలు చెలరేగాయి. మరోవైపు అమెరికా నౌకలకు మందుగుండు సరఫరా చేసే ఎంఎస్‌పీ షిప్‌పై నాలుగు డ్రోన్లతో దాడి చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. దీనిని ఆపరేషన్ ట్రూ ప్రామిస్‌లో భాగంగా చేపట్టినట్లు వెల్లడించింది. ఇరాన్ దాడుల నేపథ్యంలో బహ్రెయిన్ కూడా ప్రజలను అప్రమత్తం చేసింది. సైరన్‌లు మోగిన వెంటనే సమీపంలోని సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని సూచించింది. ఇరాక్‌లోని ఇర్బిల్ ఎయిర్ పోర్టుపై కూడా దాడి జరిగింది. దాంతో భారీగా పొగ, మంటలు వ్యాపించాయి. బాగ్దాద్‌లోని గ్రీన్ జోన్ సమీపంలో తీవ్ర ఆందోళనలు చెలరేగాయి.

ఇరాన్ రివాల్యూషనరీ గార్డ్స్ కమాండర్ హతం

అమెరికా, ఇజ్రాయెల్ వరుస దాడులతో ఇరాన్‌కు భారీ నష్టం సంభవించిది. ఇరాన్ సుప్రీం నాయకుడు అయాతుల్లా అలీ ఖమేనీతో పాటు ఆదేశ రక్షణ శాఖ మంత్రి అమీర్ నసీర్జాదే ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు ఇరాన్ రివాల్యూషనరీ గార్డ్స్ కమాండర్ మహ్మద్ పాక్‌పోర్ కూడా దాడుల్లో మృత్యువాత పడినట్లు ఇరాన్ మీడియా వెల్లడించింది. దీంతో ఇరాన్‌కు కోలుకోలేని దెబ్బ తగిలినట్లయింది. అలాగే ఇరాన్ పై ఇంకా దాడులు కొనసాగిస్తామని ఇజ్రాయెల్ ప్రకటించడంతో పశ్చిమాసీయాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఎర్పడ్డాయి.

ఇరాన్‌పై దాడులు కొనసాగిస్తాం: ఇజ్రాయెల్..

ఇరాన్‌పై దాడులు కొనసాగిస్తామని ఇజ్రాయెల్ ప్రకటించడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అమెరికాఇజ్రాయెల్ వైమానిక దాడులతో ఇరాన్‌లోని ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. మరోవైపు ఇరాన్‌లో ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వ ఏర్పాటుకు సహకరిస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఓ వైపు ప్రకటిస్తుండగా ఇరాన్ పై ఇంకా దాడులు కొనసాగిస్తామని ఇజ్రాయెల్ రక్షణ దళాలు ప్రకటించడం ఆందోళన కలిగిస్తున్నది. ఇరాన్‌లోని 30కి పైగా స్థావరాలను లక్ష్యాలుగా చేసుకున్నాం. మా లక్ష్యాల్లో ఆ దేశం వైమానిక రక్షణ వ్యవస్థలు, క్షిపణి లాంచర్లు, ఇరాన్ పాలకులు, సైనిక కమాండ్ కేంద్రాలను టార్గెట్‌గా చేసుకున్నామని ఇజ్రాయెల్ రక్షణ దళాలు పేర్కొన్నాయి.

ఇరాన్ ప్రతికార దాడులు..

ఇరాన్ మాత్రం అమెరికా, ఇజ్రాయెల్ దుశ్చర్యపై మండిపడుతున్నది. ఖమేనీ మృతిని ఇరాన్ కేబినేట్ తీవ్రంగా ఖండించింది. ప్రతీకారేచ్ఛతో రగలిపోతున్న ఇరాన్ ఇజ్రాయెల్ నగరాలపై డ్రోన్‌లతో విరుచుకుపడింది. జెరూసలెంపై దాడులతో ఆదేశ ఉత్తర ప్రాంతంలో సైరన్ శబ్దాలు మోగించి అలర్ట్‌గా ఉండాలని ఇజ్రాయెల్ పౌరులకు సూచించింది. కొన్ని డ్రోన్లను గాల్లోనే ధ్వంసం చేసింది. ఇరాన్ సైతం ఏమాత్రం వెనక్కి తగ్గకుండా అమెరికా సైనిక స్థావరాలే టార్గెట్‌గా విరుచుకుపడుతున్నది. దుబాయ్‌లోని జెబెల్ అలీ పోర్ట్, అబుదాబిలోని అల్ దఫ్రా ఎయిర్‌బేస్, దోహాలోని అల్ ఉదైద్ ఎయిర్ బేస్ (యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రధాన కార్యాలయం), సౌదీలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్ ఇలా అమెరికాకు సంబంధించిన సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ దాడులు చేసింది. ఇరు దేశాలు పరస్పర భీకర దాడులకు పాల్పడుతుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఎర్పడ్డాయి.

ఇరాన్‌పై శనివారం ఒక్కరోజే 1200 బాంబులు జారవిడిచిన ఇజ్రాయెల్..!

ఇరాన్ పై అమెరికాఇజ్రాయెల్ సంయుక్త దాడులు చేస్తున్నాయి. ఇరాన్ రక్షణ మండలి సమావేశాన్ని లక్ష్యంగా చేసుకుని జరిగిన వైమానిక దాడిలో రక్షణ మంత్రి, ఆర్మీ చీఫ్ మరణించారు. రక్షణ మంత్రి మరణించినట్లు ఇప్పటికే వార్తలు వెలువడినా ఇరాన్ అధికారిక ఆదివారం ఈ విషయాన్ని ధ్రువీకరించింది. సాయుధ దళాలకు చెందిన పలువురు కమాండర్లు కూడా మరణించారని, వారి పేర్లను తర్వాత ప్రకటిస్తామని తెలిపింది. మరోవైపు అమెరికాతో కలిసి చేపట్టిన సంయుక్త దాడుల్లో భాగంగా ఇరాన్‌పై శనివారం ఒక్కరోజే 1,200కి పైగా బాంబులను జారవిడిచినట్లు ఇజ్రాయెల్ వైమానిక దళం ప్రకటించింది. కాగా తమ దేశంపైకి ఇరాన్ 137 క్షిపణులు, 209 డ్రోన్లను ప్రయోగించిందని యూఏఈ రక్షణశాఖ వెల్లడించింది. ఈ దాడుల్లో ఒకరు మృతి చెందగా, ఏడుగురికి గాయాలయ్యాయని తెలిపింది. దుబాయ్‌లో డ్రోన్ల శకలాలు ఇళ్లపై పడటంతో ఇద్దరు గాయపడ్డారు. ఇరాన్ దాడులతో ఇజ్రాయెల్‌లోని టెల్అవీవ్‌లో దాదాపు 40 భవనాలు ధ్వంసమయ్యాయి. 200 మంది నివాసితులను అధికారులు సురక్షితంగా తరలించారు.

ఇరాన్ కొత్త నాయకత్వంతో చర్చలకు సిద్ధం!

అమెరికా, ఇజ్రాయేల్ సంయుక్తంగా చేపట్టిన 'ఆపరేషన్ లయన్స్ రోర్' విజయవంతమైందని డొనాల్డ్ ట్రంప్ అన్నారు. తమ విజయాన్ని ఎవరూ నమ్మలేకపోతున్నారని ఆయన తెలిపారు. తమ సైనిక దాడుల్లో ఇరాన్‌కు చెందిన 48 మంది నాయకులు హతమయ్యారని అమెరికా అధ్యక్షుడు వెల్లడించారు. ఖమేనీ సహా పలువురు కీలక నేతలను అంతమొందించామని ఆదివారం ట్రంప్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫాక్స్ న్యూస్‌తో ఆదివారం మాట్లాడుతూ.. తాము ఇరాన్‌పై గెలిచామని అన్నారు. 'మేము సాధించిన విజయాన్ని ఎవరూ నమ్మలేరు. ఒకేఒక షాట్ లో ఇరాన్‌లోని 48 మంది ప్రధాన నాయకులు మరణించారు. ఇంకా మా సైనిక దాడులను ఉధృతం చేస్తున్నాం. మేము అనుకున్న షెడ్యూల్ కంటే వేగంగా.. మరింత చురుకుగా ఇరాక్‌లో అమెరికా సైన్యాలు కదులుతున్నాయి' అని ట్రంప్ ఫాక్స్ న్యూస్‌తో తెలిపారు. అంతేకాదు ఇరాన్‌లోని కొత్త నాయకత్వం ఇప్పటికే వాషింగ్టన్ డీసీతో చర్చలు జరపడం మొదలెట్టిందని, వారితో చర్చలకు తాను ఆమోదం తెలిపానని ఆయన అట్లాంటిక్ ఇంటర్వ్యూలో పేర్కొన్నట్టు రాయిటర్స్ కథనం వెల్లడించింది



ప్రతీకారానికి దిగకపోవడమే మంచిది: ట్రంప్ వార్నింగ్



సుప్రీం లీడర్ ఖమేనీ మృతికి కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. ప్రతీకారానికి దిగకపోవడమే మంచిదని ఇరాన్‌కు మరోసారి వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్ ప్రతిదాడులు చేస్తే మరింత తీవ్రంగా బదులిస్తామని తెలిపారు. కనీవినీ ఎరుగని రీతిలో దాడి చేస్తామని హెచ్చరించారు. ఎవరూ ఊహించని రీతిలో దాడులు ఉంటాయని అన్నారు. ఖమేనీ మృతిపై కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటాన్న ఇరాన్ పశ్చిమాసియాలోని 27 అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్‌కుచెందిన ఐఆర్‌జీసీ దళాలు క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేపట్టాయి. అలాగే ఇజ్రాయెల్‌పై కూడా క్షిపణులతో విరుచుకుపడుతోంది. దుబాయి, దోహాలోని యూఎస్ స్థావరాలు, లెబనాన్‌లోని అమెరికా ఎంబసీపైనా దాడులు చేసింది. ఈ నేపథ్యంలోనే ట్రంప్ తీవ్రంగా స్పందించారు.

అసమానతలు ఉన్నంత కాలం మార్క్సిజం ఉంటుంది

మొదటిపేజీ తరువాయి



ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. విప్లవోద్యమం భారత దేశంలోనే కాదు, ప్రపంచ వ్యాప్తంగా ఉందని తెలిపారు. పార్టీ తీవ్రంగా నష్టపోయినా ప్రజలకోసమే పోరాటాలను కొత్త రూపంలో చేస్తుందని తెలిపారు. కొద్ది మంది మావోయిస్టులను ఎన్‌కౌంటర్లు చేసిన తరువాత ఆత్మసంతృప్తి చెందుతున్నారని, కాని విప్లవోద్యమం ఎప్పుడూ అంతం కాదని అన్నారు. ప్రాణాలుపోయేంత వరకు ప్రజా సమస్యలపైనే పోరాడుతానని, ప్రజల కోసం ముందుంటానని తెలిపారు. అనారోగ్యంతోపార్టీకి భారం కాలేకనే ప్రజా జీవితంలోకి వచ్చానని తెలిపారు. అప్పాచి నారాయణ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన అవకాశంతోనే తాను ప్రజాజీవితంలోకి వచ్చానని తెలిపారు. రాష్ట్ర కనీస సలహా మండలి చైర్మన్, ఐఎన్టీయుసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో పద్ధతులు మార్చారని, చర్చలకు సిద్ధమంటున్నప్పుడు పాలకవర్గాలు చర్చలు జరుపాల్సిన అవసరం ఉందని తెలిపారు. గతంలో దివంగత నేత రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో అస్సోంలో ప్రపల్లకుమార్ మహంతతో చర్చలు జరిపి ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేశారని, అదే విధంగా మిజోరంలో కూడా ప్రజా ప్రభుత్వం ఏర్పాటయ్యేలా చేశారన్నారు. కాని ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం చర్చలకు వస్తామన్నా, పాశవికంగా దాడులు చేస్తూ అణిచివేస్తుందన్నారు. ఈ విషయంపై కేంద్రం మరోసారి పునరాలోచించాలని కోరారు. మాజీ మంత్రి బోడ జనార్ధన్ మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం, ప్రజల హక్కుల కోసం పోరాటాలు చేసిన బండి ప్రకాశ్, అప్పాచి నారాయణలతో పాటు సమాజంలో జరిగే సమస్యలపైనే తాము పోరాటాల్లో పాల్గొంటామని తెలిపారు. ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు మాట్లాడూతూ బండి ప్రకాశ్ తన క్లాస్‌మెంట్ అని, పీడిత ప్రజల హక్కుల కోసం అటవి బాట పట్టాడని తెలిపారు. తాను ప్రభుత్వ విప్ గా ఉన్న కాలంలో ఆయన సికాసా కార్యదర్శిగా ఉన్నారని, ఎప్పుడు కూడా ఆయన నుంచి హెచ్చరికలు రావద్దని భయంతో పని చేసేవాడినని తెలిపారు. కార్మిక నేత కెంగర్ల మల్లయ్యతో పాటు కాంపెల్లి సమ్మయ్య, గురిజాల రవీందర్ రావు మాట్లాడుతూ ప్రజా జీవితంలోకి వచ్చిన ప్రకాశ్, నారాయణలకు తమవంతు సహకారం ఉంటుందని అన్నారు. అంతకుముందు డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా సీఈఆర్ క్లబ్ వరకు తీసుకొచ్చారు. ఈ ఊరేగింపులో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు డప్పు కొడుతూ నృత్యం చేశారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి హెచ్. రవీందర్ అధ్యక్షత వహించగా ఆయన మిత్రులు మేదరి సత్యనారాయణ, ఓ రాజశేఖర్, వాసాల శంకర్, నక్క వెంకట్‌రావు, ఏబూసి యాగయ్య తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రీయం

సమాచార లోపంతోనే శారదా పీఠం భూములపై గందరగోళం

- పొరపాట్లు దొర్లితే సరిదిద్దుకునేందుకు మాకెలాంటి భేషజాలు లేవు
- మతాన్ని అడ్డు పెట్టుకొని మాపై ప్రతిపక్షాల దుష్ప్రచారం
- పీఠం అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అండగా ప్రభుత్వం: మంత్రి శ్రీధర్ బాబు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 1: కోకాపేట్‌లోని శ్రీ శారదా పీఠం భూముల వ్యవహారంలో సమాచార లోపం వల్లే గందరగోళం తలెత్తిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఆ భూములు పీఠానికే చెందుతాయని, ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. పీఠం అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. ఆదివారం కోకాపేట్ లోని శ్రీ శారదా పీఠాన్ని సందర్శించారు. అక్కడి రాజ శ్యామల అమ్మవారి ఆలయం, ఇతర నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఉత్తర పీఠాధిపతులు స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామీజీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తోందని అన్నారు. మా ప్రభుత్వానికి భేషజాలు లేవని, తప్పులు దొర్లితే ఎప్పటికప్పుడు సరిదిద్దుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అసలు విషయం తెలిసిన వెంటనే శారదా పీఠం భూముల విషయంలో జరిగిన పొరపాటును వెంటనే సరిదిద్దుకున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మతాన్ని అడ్డు పెట్టుకొని కొందరు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. తమ రాజకీయ ఉనికి కోసం ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మాది బుల్డోజర్ సంస్కృతి కాదని, కబ్జాకోరుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడటం చూసి ఓర్వలేకే కొందరూ మాపై కావాలనే బురద చల్లుతున్నారని విమర్శించారు. బాపు ఘాట్ అభివృద్ధి విషయంలో ప్రజాభీష్టం మేరకే ముందుకెళ్తామని, తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని స్థానికులకు మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు



కొత్త పెళ్లికూతురు రష్మిక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబసభ్యులను జూబ్లీహిల్స్ లోని వారి నివాసంలో కలిశారు. ఈ నెల 4 న హైదరాబాద్లో జరుగనున్న తన రిసెప్షన్ కు విజయ్ రావలని ఆహ్వానించారు. విషయాన్ని రష్మిక స్వయంగా సోషల్ మీడియా వేదికగా వెల్లడిచారు. విజయ్ దేవరకొండ- రష్మిక వివాహం ఘనంగా జరిగినప విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సీఎం సతీమణి గీత, రష్మికకు ఒక ప్రత్యేక బహుమతిని అందజేశారు. సీఎం రేవంత్ రెడ్డి సతీమణి ఇచ్చిన బహుమతి చాలా అందంగా ఉందని, దీన్ని తాను కచ్చితంగా ఏదైనా అత్యంత ప్రత్యేకమైన సందర్భంలో ధరిస్తాను అని రష్మిక ఈ సందర్భంగా పేర్కొన్నారు.

- ప్రతిపక్షం, హైదరాబాద్

షాద్‌నగర్‌లో డీసీపీ కార్యాలయం ప్రారంభం

- మిలీనియం టౌన్‌షిప్‌లో తాత్కాలికంగా ఏర్పాట్లు



ప్రతిపక్షం, షాద్ నగర్, మార్చి 1: పట్టణంలో పోలీసు వ్యవస్థకు మరింత బలోపేతం కలిగే విధంగా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) కార్యాలయాన్ని మిలీనియం టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేశారు. ఆదివారం ఈ కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. షాద్ నగర్ డీసీపీగా నియమితులైన శిరీష రాఘవేందర్ ఇకపై ఈ కార్యాలయం నుంచే ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు. ఇటీవలే షాద్‌నగర్ ప్రాంతానికి డీసీపీ స్థాయి ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో, ఇది కీలక ముందడుగుగా భావిస్తున్నారు. పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతున్న దృష్ట్యా చట్టంసువ్యవస్థల పరిరక్షణ కోసం ఉన్నత స్థాయి పోలీసు పర్యవేక్షణ అవసరమైందని అధికారులు పేర్కొన్నారు. మిలీనియం టౌన్‌షిప్‌లో తాత్కాలికంగా కార్యాలయం ఏర్పాటు చేయగా, త్వరలోనే శాశ్వత భవనం నిర్మాణం కోసం పట్టణ పరిధిలో స్థల పరిశీలన చేపట్టనున్నట్లు సమాచారం. డీసీపీ కార్యాలయం ప్రారంభంతో ప్రజల సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని, పోలీస్ సేవలు మరింత సత్వరంగా అందుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదివారం హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల న హైదరాబాద్‌లో జరగనున్న తన కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహ వేడుకకు విచ్చేసి, నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ వివాహ ఆహ్వాన పత్రికను ఆయనకు అందజేశారు. డిప్యూటీ సీఎం వెంట బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నారు.

- ప్రతిపక్షం, హైదరాబాద్



సీఏలో సత్తా చాటిన బాల ఆశ్రిత

- మొదటి ప్రయత్నంలోనే విజయం

ప్రతిపక్షం, షాద్ నగర్, మార్చి 1: పట్టణంలోని తిరుమల మెఘా టౌన్ షిప్ కు చెందిన పోతిరెడ్డి శౌరెడ్డి, ప్రేమలత దంపతుల పెద్ద కుమార్తె బాల ఆశ్రిత చార్టర్డ్ అకౌంటెన్సీ (సీఏ)లో మొదటి ప్రయత్నంలోనే ఉత్తీర్ణత సాధించి ప్రతిభ చాటింది. ఆమె విజయంతో కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. రైతు కుటుంబంలో జన్మించిన ఆశ్రిత, సాధారణ నేపథ్యాన్ని అధిగమిస్తూ అసాధారణ లక్ష్యాన్ని సాధించింది. తండ్రి వ్యవసాయం చేస్తుండగా, తల్లి మెరియారాణి స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. చిన్ననాటి నుంచే కష్టపడి చదువుకుంటూ వచ్చిన ఆశ్రిత, పట్టుదలతో ముందుకు సాగి సీఏ వంటి కఠినమైన పరీక్షలో తొలి ప్రయత్నంలోనే విజయం సాధించడం విశేషం. ఆమె సాధనకు కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం బలంగా నిలిచాయని స్థానికులు పేర్కొన్నారు. కాలనీవాసులు ఆశ్రితను ఘనంగా అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కాలనీ పెద్దలు బ్రహ్మయ్య దంపతులు, లక్కాకుల కిరణ్ కుమార్ దంపతులు, మాణిక్య ప్రభు గుర్రంపల్లి దంపతులు, రోమన్ రెడ్డి దంపతులు, దొంతు నాగరాజు దంపతులు, కమ్మరి శ్రీశైలం దంపతులు, నరేశ్ కుమార్ దంపతులు, శంకరాచారి దంపతులు, రాంప్రసాద్ దంపతులు, రాములు గౌడ్ దంపతులు, రవి గుప్త దంపతులు తదితరులు బాల ఆశ్రితను అభినందించారు.

రంజాన్ మత సామరస్యానికి ప్రతీక

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 1: రాష్ట్ర అభివృద్ధి కోసం హిందూ, ముస్లింలు కలిసికట్టుగా ముందుకు సాగాలని, తెలంగాణలో గంగా-జమునా తెహజీబ్ సంస్కృతి కొనసాగాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆకాంక్షించారు. రంజాన్ మాసం సందర్భంగా నిర్వహించిన ఇఫ్తార్ విందులో కవిత పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రగతికి ఐక్యత, పరస్పర గౌరవం అత్యంత అవసరమని పేర్కొన్నారు. హిందూ, ముస్లింలు కలిసి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలనే సంకల్పంతో ఇలాంటి ఇఫ్తార్ విందులు నిర్వహించడం ఆనందదాయకమని తెలిపారు. గత రెండేళ్లుగా అబ్దుల్ బషీర్ ప్రత్యేక శ్రద్ధతో ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేస్తున్నారని, ఆయన సేవలను అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. తెలంగాణలో గంగా-జమునా తెహజీబ్ సంస్కృతి ఇదే విధంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ, రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని కవిత పేర్కొన్నారు.

పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

- ఆదివారం 6057 మెగావాట్ల గరిష్ట డిమాండ్
- డిమాండ్ కు తగ్గ సరఫరా ఉంటుందన్న ఎన్పీడీసీఎల్ సీఎండి కర్నాటి వరుణ్ రెడ్డి



ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 1: ఆదివారం తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్పీడీసీఎల్) చరిత్రలోనే అత్యధిక గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 6267 మెగావాట్లు నమోదైనట్లు సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. శనివారం నమోదైన 6057 మెగావాట్ల గరిష్ట డిమాండ్‌ను అధిగమిస్తూ, నేడు 6267 మెగావాట్లకు చేరుకోవడం ఎన్పీడీసీఎల్ చరిత్రలో మైలురాయిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఇది సంస్థ ముందస్తుగా తీసుకున్న ప్రణాళికాబద్ధమైన చర్యల ఫలితమని స్పష్టం చేశారు. రోజురోజుకు ఎండలు పెరుగుతుండటంతో విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరుగుతోందని తెలిపారు. అయినప్పటికీ, ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. డిమాండ్ ఎంత పెరిగినా సరఫరాలో అంతరాయం రాకుండా విద్యుత్ అందించేందుకు సంస్థ పూర్తిగా సమాయత్తమై ఉందని సీఎండీ ఉద్ఘాటించారు. వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. వచ్చే వేసవిలో డిమాండ్ మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని, అందుకు సంస్థ పూర్తిగా సిద్ధంగా ఉందని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా చర్యలు తీసుకుంటున్నామని సీఎండీ వివరించారు.

సమాచార కమిషనర్ దేశాల భూపాల్ జన్మదినం



ప్రతిపక్షం, రాజేంద్ర నగర్, మార్చి 1: తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్ జన్మదిన వేడుకలను హైదరాబాద్ రాజేంద్ర నగర్ లోని వారి నివాసంలో నిర్వహించారు. సమాచార హక్కు చట్టం సాధన కమిటి జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ మరియు రాష్ట్ర అధ్యక్షులు సూర స్రవంతి ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, ఉపాధ్యక్షులు గోపీనాథన్ కట్టెకోల, కార్యదర్శి తోట శ్రీనివాస్, రాష్ట్ర కోఆర్డినేటర్ కొంగటి రాజ్ కుమార్, కార్యనిర్వాహక అధ్యక్షులు చింతల రాఘవేందర్, ఉపాధ్యక్షులు ప్రకాష్ పటేల్, కార్యదర్శి అజయ్ కుమార్, అరుణ్ సింగ్, సుధామయి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ముచ్చర్ల మల్లేష్, కన్వీనర్ ప్రవీణ్, ఉపాధ్యక్షులు దీపక్ కులకర్ణి, రాజశేఖర్ పాల్గొన్నారు.

మరో ప్రతిష్టాత్మక టోర్నమెంట్ కు హైదరాబాద్ ఆతిథ్యం

- మార్చి 8 నుండి మహిళల హాకీ వరల్డ్ క్వాలిఫైయింగ్ టోర్నమెంట్
- మెగా ఈవెంట్ కు ఆదిత్యం ఇవ్వనున్న గచ్చిబౌలి హాకీ స్టేడియం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మర్చి 1 : హైదరాబాద్ మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ క్రీడా వేడుకకు వేదిక కానుంది. 'ఫెడరేషన్ ఇంటర్నేషనల్ హాకీ(ఎఫ్ఐహెచ్) ఆధ్వర్యంలో నిర్వహింస్తున్న మహిళల హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ 2026 టోర్నమెంట్ ను తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. క్రీడాశాఖ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ ను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించారు. ఈ పోటీలు మార్చి 8 నుండి 14 వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ క్వాలిఫయర్స్‌లో భారత్ సహా మొత్తం ఎనిమిది దేశాల జట్లు పాల్గొంటున్నాయి. ఈ టోర్నమెంట్ 2026 మహిళల హాకీ వరల్డ్ కప్‌కు అర్హత సాధించేందుకు కీలక పాత్ర పోషించనుంది. స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే హెచ్ఐఎఫ్ ప్రతినిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వంలోని పలు శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఈ టోర్నమెంట్ ను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

తెలంగాణకు ప్రేరణగా గుజరాత్‌లో 'అమూల్' మోడల్

- గుజరాత్‌లో మంత్రి వాకిటి శ్రీహరి బృందం పర్యటన



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 1: గుజరాత్లో అమూల్ మోడల్ ద్వారా సాధించిన విజయాలు తెలంగాణకు ప్రేరణగా నిలుస్తాయని రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గుజరాత్ రాష్ట్రంలోని అమూల్ పాల ప్లాంట్ ను మంత్రి వాకిటి శ్రీహరి తదితరులు సందర్శించారు. రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, మంత్రి బృందానికి నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు చైర్మన్ డాక్టర్ మీనేష్ షా బృందం ఘనస్వాగతం పలికింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పాడి పరిశ్రమను మరింత అభివృద్ధి చేసి, రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో, మహిళల ఆర్థిక సాధికారతలో డెయిరీ రంగం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పాల ఉత్పత్తి పెంపు, ఆధునిక సాంకేతిక వినియోగం, సహకార వ్యవస్థ బలోపేతం, రైతులకు మెరుగైన ధరలు అందించే దిశగా గుజరాత్ అనుభవాలను తెలంగాణలో అమలు చేయనున్నట్లు తెలిపారు. పాల ఉత్పత్తిలో గుజరాత్ మోడల్ తెలంగాణకు అవసరం అని, పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందుకోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. రాష్ట్రాన్ని పాల ఉత్పత్తిలో నెంబర్‌వన్ గా నిలిపేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా అమూల్ సంస్థలో అమలు చేస్తున్న ఆధునిక సాంకేతిక విధానాలు, రైతులకు అందిస్తున్న సేవలు, పాల సేకరణ, నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వ్యవస్థలపై మంత్రి బృందానికి చైర్మన్ డాక్టర్ మీనేష్ షా వివరించారు. పాడి పరిశ్రమ ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించడం, సహకార వ్యవస్థను మరింత విస్తరించడం వంటి అంశాలపై గుజరాత్ అధికారులు పేర్కొన్నారు. అమూల్ మోడల్ ప్రగతి పథంపై, దేశవ్యాప్తంగా సహకార డెయిరీ రంగ అభివృద్ధిలో పాత్ర గురించి తెలిపారు.



కోహెడలో ఘనంగా మల్లికార్జున స్వామి కల్యాణం

ప్రతిపక్షం, కోహెడ, మార్చి 1: కోహెడ మండల కేంద్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని ఆలయం కమిటీ చైర్మన్ సూరు రాములు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి విచ్చేసిన గ్రామ సర్పంచ్ సర్పంచ్ బందెల సుజాత బాలకిషన్, ఉప సర్పంచ్ కందాల వెంకటేష్, మాజీ సర్పంచ్ గోరిట్యాల లక్ష్మణ్ ఇందుమతి , కోహెడ మండల కుర్మ సంఘం అధ్యక్షులు కొనే శేఖర్, వార్డ్ మెంబర్లు, పొన్నాల శ్రావణి, గుగ్గిళ్ల శ్రీనివాస్, చుక్క శంకర్, మాజీ వార్డ్ సభ్యులు వేల్పుల వెంకటస్వామి, బీసీ నేత గోవిందు సురేష్ లను ఆలయ చైర్మన్ సూరు రాములు, గౌరవ అధ్యక్షులు చుక్క అశోక్, పాటు దేవస్థాన కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఒగ్గు పూజరులచే పట్నాలు, ఒగ్గు కథలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



కూటమి ప్రభుత్వం బెదిరింపులకు వైసీపీ భయపడదు. అంబటి ఎప్పుడూ ఎవరినీ దూషించలేదు. టీడీపీ నేతలు కావాలనే ఆయన్ను రెచ్చగొట్టారు. రాంబాబు క్షమాపణలు చెప్పినా ఆయన ఇంటిపై దాడి చేశారు. లోకేశ్ రెడ్‌బుక్ రాజ్యాంగానికి వైసీపీ భయపడదు. 2029లో జగన్ సీఎం కావడం తథ్యం. రెడ్‌బుక్‌లో జగన్ పేరు ఉంటే లోకేశ్‌కే ఇబ్బంది.

- వైసీపీ నేత కొడాలి నాని

బహుళ

పరిచయం

బహుముఖీన మైథిలీ సాహితీవేత్త గజేంద్ర ఠాకూర్



డా.టి.రాధాకృష్ణమాచార్యులు
9849305871

భారతదేశంలోని ఉత్తర బీహార్, అలాగే ఆగ్నేయ నేపాల్ లో మాట్లాడే మైథిలి భాషలో రచనలు చేసే గజేంద్ర ఠాకూర్ గొప్ప భారతీయ రచయిత. ఆయన రచనతో పాటు నిఘంటువు రచయిత,మిథిల, పురాతన విదేహ ఇంకా మైథిలి చరిత్రకారుడు కూడా. అట్లనే ఆయన పాలియోగ్రాఫర్ కూడా. ఆయన మైథిలి భాష (మిథిలక్షర్ లిపి) యొక్క తిర్హుత లిపిలోని పురాతన మరియు మధ్యయుగ తాళపత్ర శాసనాలను బాగా చదివి తెలుసుకున్నారు. ఈ పంజీలు మిథిల ప్రాంతంలోని మైథిల్ బ్రాహ్మణ సమాజం యొక్క వంశపారంపర్య రికార్డులు, ఇంకా దాదాపు 100 కులాంతర వివాహాల వివరాలను కలిగి ఉన్నాయి. అంతేకాకుండా ఇది ఇప్పటివరకు పౌరాణికమైనవిగా పరిగణించబడే వ్యక్తులు మరియు వ్యక్తిత్వాల వ్రాతపూర్వక చారిత్రక రికార్డులను అందిస్తుంది. అట్లాగే ఆయన మిథిల పొడవునా దేవాలయాలు,శిథిల భవనాలపై చెక్కబడిన లిపిని కూడా ఆకళింపు చేసుకున్న సాహితీవేత్త.అందుకే ఆయన బహుముఖీన సృజనకారుడు. భారతదేశంలోని బీహార్ లోని భాగల్పూర్ చెంతగల మధుబనిలో మార్చి 30, 1971న పుట్టిన గజేంద్ర ఠాకూర్ గొప్ప రచయిత,ప్రసిద్ధ చరిత్రకారుడు,విద్యావేత్త. 20వ21వ శతాబ్ద కాలం శైలిలో రచనలు చేసే సాహిత్య విమర్శకుడు,నవలా రచయిత, నాటక రచయిత, కవి, లెక్సికోగ్రాఫర్... ఒక్క మాటలో ఆయన బహుముఖీనుడు. గజేంద్ర ఠాకూర్ ప్రఖ్యాత రచనలు సహస్రబాధాని, సహస్రశీర్ష, శబ్దశాస్త్రం, సహస్రాబ్దిక్ చౌపర్ పర్, జీనోమ్ మ్యాపింగ్ 450 AD నుండి 2009 AD మిథిలక్ పంజీ ప్రబంధ్,విదేహఎడిట్ (చేసింది) కలిపి మొత్తంగా 127 సంపుటాలు పేర్కొనవచ్చు. ఆయనసాహిత్య కార్యకలాపాలు చూస్తే అతను మైథిలి భాషలో కురుక్షేత్రం అంతర్మాణక్ అనే రచనను ఏడు సంపుటాలలో రాశాడు. అందులో సాహిత్య విమర్శ,ఒక నవల సహస్రబాధాని 'ది కామెట్' పేరుతో ఆంగ్లంలోకి అనువదించబడింది. ఇంకా కవితా సంకలనం సహస్రబ్దిక్ చౌపర్ పర్,చిన్న కథల సంకలనం,గల్ప్ గుచ్, నాటకం సంకర్షన్,రెండు దీర్ఘ ఇతిహాస పద్యాలు (గీత్ ప్రబంధ్), త్వంచహంచ్ అసంజతి మాన్, పిల్లల సాహిత్యం, పెద్దల సాహిత్యం,బాల మండలి కిషోర్ జగత్ వంటివి ఉన్నాయి. ఆ తరువాత ఆయన లిఖితీకరించిన 11000 తాళపత్ర శాసనాలు 'జీనోమ్ మ్యాపింగ్ – 450 AD నుండి 2009 AD మిథిలక్ పంజి ప్రబంధ్'అనే వివరణాత్మక పరిచయంతో ఒకే సంపుటిలో ప్రచురించబడ్డాయి. అలాగే దాని సీక్వెల్ 'జెనియోలాజికల్ మ్యాపింగ్ 450 AD నుండి 2009 AD మిథిలక్ పంజి ప్రబంధ్ వాల్యూమ్.II' విడుదల ఆయన 'మైథిలిఇంగ్లీష్ నిఘంటువు', & 'ఇంగ్లీష్ మైథిలి నిఘంటువు'లను కూడా సంకలనం చేశారు.ఇప్పటి వరకు మరే ఇతర నిఘంటువులోనూ అందుబాటులో లేని కంప్యూటర్ పరిభాషను కలిగి ఉండటం వలన ఇంగ్లీష్మైథిలి నిఘంటువు ప్రత్యేకంగా గుర్తింపును పొందినది. ఆయన రెండువారాలకు ఒకసారి వచ్చే మైథిలి బై వీక్లీ ఇజర్నల్ 'విదేహ'కు సంపాదకుడుగా



సేవలందించారు. ఆయన విశేష కృషిలో భాగంగా సాంప్రదాయ మిథిలాక్షర్ అంటే మైథిలి భాష యొక్క తిర్హుత లిపి మితిలాక్షర్ లిపి,దాని ప్రామాణీకరణకు మార్గదర్శకుడు. ఇంకా యూనికోడ్ ఎన్కోడింగ్ దరఖాస్తుదారు (ఇప్పుడు ISO తిర్హుతను) యూనికోడ్‌గా ఎన్కోడింగ్‌ను ఆమోదించింది. ఆయన సహకారాన్ని గుర్తించి సూచనలలో కూడా చేర్చారు. ఆయన మైథిలి నుండి ఆంగ్లంలోకి కూడా అనువదించిన గొప్ప అనువాదకుడు. ఆయన కన్నడ (అశోక్ హెగ్డే), తెలుగు (ఎన్. అరుణ, షేక్ ముహమ్మద్ షరీఫ్), ఒరియా (బాసుదేవ్ సునాని, భరత్ మాఝీ), మరి గుజరాతీ (బాబు సుతార్, అజయ్ సర్వయ్య, రాజేంద్ర పటేల్, హేమంగ్ అశ్విన్ కుమార్ దేశాయ్) రచనలను ఆంగ్లం ద్వారా కవితలు మరియు కథలను మైథిలిలోకి అనువదించారు. అతను మైథిలీ రచయితల సంస్థ మైథిలీ లేఖక్ సంఘ్ సభ్యుడు. ఆయన ఇంగ్లీష్మైథిలి కంప్యూటర్ నిఘంటువును కూడా సంకలనం చేశారు. మిథిలాక్షర్ (తిర్హుత) లిపి కోసం యూనికోడ్ అప్లికేషన్‌ను సిద్ధం చేయడంలో ఆయన సహాయం చేశారు. ఆయన ఇంగ్లీష్మైథిలి నిఘంటువు అటువంటి నిఘంటువు మాత్రమే.ఆయన సామాజిక అభివృద్ధి పనులలో కూడా దోహదపడ్డారు.

గజేంద్ర ఠాకూర్ కు వచ్చిన అవార్డులు, గౌరవాలు సాహిత్య బహుమతుల కంటే ప్రధానంగా మైథిలి పండిత సమాజాల నుండి వచ్చిన ప్రశంసలు ఎక్కువగా ఆయన బహుముఖ ప్రజ్ఞపైన గణనీయమైన ప్రభావాన్ని ప్రతిబింబిస్తాయి. మైథిలీ భాషలో సాహిత్య విషయాలను బతికించే సాహిత్య మణిహారం గుర్తింపుతో ఆయన కృషిని హైలైట్ చేస్తుంది.

ఆయన వారసత్వం సంపదను పరిశీలిస్తే మైథిలి సాహిత్యంపై ప్రభావం మైథిలి సాహిత్యంపై గజేంద్ర ఠాకూర్ ప్రభావం, భాషను డిజిటలైజ్ చేయడంలో మరి సమకాలీన రచయితలకు వేదికలను అందించడంలో ఆయన చేసిన మార్గదర్శక ప్రయత్నాల ద్వారా ప్రముఖంగా గుర్తించబడింది. 2000లో, అతను భల్సారిక్ గచ్‌ను ప్రారంభించాడు. ఇది యాహూ జియోసిటీస్‌లో మైథిలిలో మొట్టమొదటి ప్రశంసలు పొందిన డిజిటల్ బ్లాగులలో ఒకటిగా గుర్తించబడింది. ఇది భాష యొక్క ఆన్‌లైన్ ఉనికిని ప్రారంభించింది మరియు పరిమిత ముద్రణ వనరుల మధ్య సాహిత్య రచనలకు విస్తృత ప్రాప్యతను సులభతరం చేసింది. ఈ ప్రారంభ డిజిటల్ ప్రయత్నం తదుపరి ఆన్‌లైన్ మైథిలి కంటెంట్‌కు పునాది వేసింది, ఇంటర్నెట్ యుగంలో సాహిత్యం ఎలా వ్యాప్తి చెందుతుంది మరియు సంరక్షించబడుతుంది అనే దానిపై ప్రభావం చూపింది.జనవరి 2008లో ప్రారంభించబడిన ప్రారంభ మైథిలి పక్షంవారీ ఇజర్నల్ విదేహ సంపాదకుడిగా, ఠాకూర్ ఉద్భవిస్తున్న రచయితలకు కీలకమైన అవుట్‌లెట్‌ను కొనసాగించారు. మార్చి 2021 నాటికి దాని 318వ సంచిక వరకు ప్రచురించారు మరియు కీలక గ్రంథాల యొక్క విస్తృతమైన PDF ఆర్కైవ్‌ను సృష్టించారు. తన నాయకత్వంలో, విదేహ ప్రపంచ సాహిత్యాల నుండి మైథిలిలోకి అనువాదాలను నొక్కి చెబుతాడు, విభిన్న కథనాలు మరియు శైలులను సమగ్రపరచడం ద్వారా కానన్‌ను సుసంపన్నం చేస్తాడు. అదే సమయంలో భాషా ప్రామాణికతను కాపాడటానికి దేవనాగరి మరియు బ్రెయిలీ ఫార్మాట్‌లతో పాటు మిథిలాక్షర్ లిపికి ప్రాధాన్యత ఇస్తాడు. అతని సంపాదకీయ పాత్ర కొత్త ప్రతిభను పెంపొందించింది. ఇంకా సాంప్రదాయ సరిహద్దులకు మించి శైలి యొక్క పరిధిని విస్తరించింది. ఠాకూర్ రచనలు 2014లో మైథిలి వికీపీడియా స్థాపనకు విస్తరించాయి, అక్కడ అతను అవసరమైన డిజిటల్ కంటెంట్‌ను అందించాడు, ప్రపంచ ఎన్సైక్లోపెడిక్ ప్రాతినిధ్యం మరియు మైథిలి గ్రంథాలతో, పండితులతో సంప్రదింపులలో నిమగ్నమయ్యాడు.

అవార్డులు మరియు గౌరవాలు

మైథిలిలో వెలువడే తొలి పక్షం ఈజర్నల్ అయిన విదేహలో ఠాకూర్ సంపాదకీయ పాత్ర, ఆ భాషలో సాహిత్య ప్రసంగాన్ని నిలబెట్టినందుకు గుర్తింపును హైలైట్ చేస్తుంది. జాతీయ సాహిత్య బహుమతుల కంటే ప్రధానంగా మైథిలి పండిత సమాజాల నుండి వచ్చిన ఈ ప్రశంసలు, ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి అయినప్పటికీ గణనీయమైన ప్రభావాన్ని ప్రతిబింబిస్తాయి.

(పరిచయకర్త రచయిత)

యాది

తెలుగు నాటక సాహిత్యంలో చెరగని సంతకం

వడ్డాది సుబ్బరాయుడు



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494


వడ్డాది సుబ్బరాయుడు (జూలై 30, 1854 - మార్చి 2, 1938) తెలుగు నాటక సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని పొందిన గొప్ప నాటక రచయిత. ఆయన "వసురాయకవి"గా ప్రసిద్ధి చెందారు. తెలుగులో నాటక రంగానికి ప్రాథమిక రూపుదిద్దించిన వ్యక్తులలో ఒకరుగా, ఆయన నాటక రచన సంస్కృత నాటక సంప్రదాయాన్ని అనుసరించినప్పటికీ, తెలుగు భాషలో సహజంగా ప్రవహించేలా తన రచనలను తీర్చిదిద్దారు.

వడ్డాది సుబ్బరాయుడు 1854 జూలై 30న ఆంధ్ర ప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాలోని పాసర్లపూడి గ్రామంలో జన్మించారు. ఆయనకు అనధికారిక విద్య మాత్రమే లభించినప్పటికీ, స్వయంకృషితో గొప్ప పండితుడిగా ఎదిగారు. బాల్యంలోనే నాటకాలు, సాహిత్యంపై మక్కువ కలిగి, స్వయంగా అధ్యయనం చేసి పాండిత్యం సంపాదించారు.

సుబ్బరాయుడు తన విద్యాభ్యాసాన్ని పూర్తిచేసిన తరువాత, రాజమండ్రిలోని ఉన్నత పాఠశాలలో తెలుగు అధ్యాపకుడిగా పని చేశారు. అనంతరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో తెలుగు ఉపన్యాసకుడిగా నియమితులయ్యారు. ఈ పదవుల్లో ఉండే సమయంలో తెలుగు సాహిత్యాన్ని మరింతగా అభ్యసించి, నాటక రచనలో తనదైన ముద్ర వేశారు.

వడ్డాది సుబ్బరాయుడు చాటు పద్యాలు చెప్పడంలో అపారమైన నైపుణ్యం కలిగినవారు. ఆయన కవితా వ్యాసంగం 1875లో ప్రారంభమై, మరణించే వరకు కొనసాగింది.

ఆయన రచనల్లో ప్రధానంగా...వసురాయ చాటు ముక్తావళి, వసురాయ చాటు ప్రబంధం, నామనందన శతకం (1877), భక్త చింతామణి శతకం (1883), ఆర్త రక్షమణి శతకం (1933)తో పాటు, సుబ్బరాయుడు మొత్తం 7 నాటకాలు రచించారు. అన్నీ సంస్కృత నాటకాల తెలుగు అనువాదాలు. వేణి సంహారం (1883, ప్రచురణ: 1886), విక్రమోర్వశీయం (1884, ప్రచురణ: 1889), ప్రబోధ చంద్రోదయం (1891, ప్రచురణ: 1893), చండ కౌశికము (1900), అభిజ్ఞాన శాకుంతలము (1906), మల్లికామారుత ప్రకరణము (1903, ప్రచురణ: 1929), ఆంధ్ర కుందమాల (1931, ప్రచురణ: 1932). ఆయన నాటకాలు భాషా సౌందర్యంతో పాటు, సంస్కృత నాటక శైలిలో నిర్మితమై, తెలుగులో చదవడానికి, ప్రదర్శించ దానికి అనువుగా ఉండేవి. వాటిని పాఠ్య గ్రంథాలుగా గుర్తించారు, తద్వారా అనేక మంది విద్యార్థులు, నాటక కారులు ఈ నాటకాల ద్వారా ప్రేరణ పొందారు. ఆయన నాటకాలు నాటకీయత, హాస్యం, భావావేశం, పాత్రలలోతైన చిత్రణను కలిగి ఉంటాయి. ఆయన సంస్కృత నాటకాలను తెలుగులోకి అనువదించి, తెలుగు నాటక రంగానికి గొప్ప మదుపరులుగా నిలిచారు. ఆయన రచనలు తెలుగు నాటక రంగానికి ప్రేరణగా మారాయి. నాటక రంగంలో సంస్కృత నాటకాల అనువాదాలను మాత్రమే కాకుండా, స్వతంత్రంగా తెలుగు నాటక రచనకు మార్గ దర్శకత్వాన్ని అందించారు. ఆయన ప్రతిభను గుర్తించి, రాజమండ్రి పురప్రముఖులు గండ పెండేరం తొడిగి "సూక్తి సుధానిధి" అనే బిరుదునిచ్చి



వడ్డాది సుబ్బారాయుడు.

సత్కరించారు. ఆయన నాటకాలు పాఠ్యగ్రంథాలుగా చేరి, విద్యార్థులకు ప్రాముఖ్యత కలిగాయి.

సుబ్బరాయుడు 1938 మార్చి 2న కన్నుమూశారు. అయినప్పటికీ, ఆయన రచనలు తెలుగు నాటకరంగంలో ఇప్పటికీ ప్రాముఖ్యత కలిగినవే. ఆయన అనువాదాలు, రచనలు నాటక కళాకారులు, విద్యార్థులు, సాహిత్యాభిమానుల కోసం మిగిలి పోయాయి.

వడ్డాది సుబ్బరాయుడు తెలుగు నాటకరంగానికి గొప్ప సేవ చేశారు. ఆయన రచనలు సాంస్కృతిక, సాహిత్య, నాటక ప్రస్థానాలకు మార్గదర్శకంగా నిలిచాయి. ఆయన రాసిన నాటకాలు నేడు కూడా ప్రదర్శించబడుతూనే ఉన్నాయి. సంస్కృత నాటకాలను తెలుగులో అందుబాటులోకి తీసుకు రావడం ద్వారా ఆయన చేసిన కృషి తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్మరణీయంగా నిలుస్తుంది.

(మార్చి 2... వడ్డాది సుబ్బరాయుడు వర్ధంతి)

కవిత



రంగుల పండుగ హోళి

రంగు రంగుల పండుగ హోళి
రంగుల హోళి జీవన కేళి
ప్రాచీనమైన పండుగ హోళి
పాటల పండుగ హోళి
ఆనందాల పండుగ హోళి!!

మోదుగు పూలచే రంగులతో ఆటపాట
పిల్లల పాటల హోళి
పొద్దంతా పాటల పండుగ
రంగుల హరివిల్లు హోళి!!

తెలంగాణ యాసలో పాటల హోళి
వసంత ఋతువు రాకతో వచ్చే పండుగ
పాటలతో మొదలయ్యే పండుగ
పది రోజుల పాటల పండుగ

మగవారు కొలలతో ఆట ఆడే పండుగ
స్త్రీల చప్పట్లతో పాటల పండుగ
ప్రకృతితో ముడిపడిన పండుగ హోళీ
పల్లె పల్లె నా పాటల పండుగ!!



దేవులపల్లి రమేశ్
నంగునూర్, సిద్దిపేట
9963701294



ప్రేమ..పంచ్..!

మనిషికైనా ...జంతువుకైనా...
బ్రతకటానికి ఆహారం ఒక్కటే సరిపోదు...
కాసింత ప్రేమ కావాలి...
కాసింత ఓదార్పు కావాలి...

దెగ్గరకు తీసుకుని హత్తుకునే
ఆత్మీయ చేతులు కావాలి...
ప్రేమను పంచే ఆలింగనాలు కావాలి...
కష్టంలోనూ సుఖంలోనూ..
నేనున్నానంటూ...దరిచేరే
ఓ అనురాగ బంధువు కావాలి...
ఆప్యాయతల నేస్తం కావాలి...
తన కోతి జాతి తనను దూరంగా నెట్టినా..
ప్రాణంలేని బొమ్మలో
తల్లిని చూసుకుంటూ..
తన్మయత్వాన్ని పొందుతుంది "పంచ్"

ఈ కోతి పిల్ల
ఇప్పుడు సమాజానికి
ఓ సందేశం విసురుతోంది

ఎన్ని సదుపాయాలు దరి చేరినా..
ప్రేమ మూర్తులు చెంతలేని జీవితం
నరకాన్ని తలపిస్తుంది
ఆలోచించాలి అందరినూ...
మానవత్వం చిగురించాలి..అందరిలోనూ...!

(జపాన్ లోని ఇచికావా సిటీ జూలో కోతి పిల్ల "పంచ్" కోతి బొమ్మతో ఆడుకున్న దృశ్యం చూసి)

డా.కటుకోర్ఘ్వుల రమేష్
9949083327



ప్రశంస

ది జెంటిల్ మేన్ 'అర్జున్ సర్జా'



కోట దామోదర్
9391480475

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తరతరాలుగా హీరోల వారసులు హీరోలుగానే ఎంట్రీ ఇవ్వడం మనం ఎన్నోసార్లు చూశాం. కానీ హీరోల కూతుళ్లు మాత్రం ఇండస్ట్రీలోకి హీరోయిన్‌లుగా రావడం చాలా అరుదుగా జరిగిన విషయం. ఈ నేపథ్యంలో ఒక ప్రత్యేక ఉదాహరణగా నిలిచే పేరు అర్జున్ సర్జా.

"ఒకేఒక్కడు" చిత్రంతో అర్జున్ తెలుగులో ఒక సంచలనం సృష్టించాడు. ఒక సాధారణ జర్నలిస్ట్ ఒక్కరోజు ముఖ్యమంత్రిగా మారి వ్యవస్థను కుదిపేసే కథతో వచ్చిన ఈ సినిమా ప్రేక్షకుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచింది. అంతకు ముందు తమిళంలో వచ్చిన Gentleman చిత్రంతో కూడా ఆయనకు విశేషమైన గుర్తింపు వచ్చింది. న్యాయం కోసం పోరాడే పాత్రలు అర్జున్‌కు ఒక ప్రత్యేకమైన ఇమేజ్‌ను తీసుకువచ్చాయి.

అటువంటి మాస్ మరియు యాక్షన్ హీరోగా పేరు తెచ్చుకున్న అర్జున్, తన కూతురు Aishwarya Arjunను హీరోయిన్‌గా పరిచయం చేస్తూ Seetha Payanam అనే చిత్రాన్ని నిర్మించి దర్శకత్వం వహించారు. సాధారణంగా స్టార్ హీరోల కూతుళ్లు సినీ రంగానికి దూరంగా ఉండడం ఎక్కువగా కనిపించినా, అర్జున్ మాత్రం తన కుమార్తె ప్రతిభను నమ్మి, ఆమెకు ఒక మంచి ప్రారంభ వేదికను కల్పించారు.

"సీత పయనం" ఒక కుటుంబ కథా చిత్రంగా రూపొందింది. గ్లామర్‌కంటే భావోద్వేగాలకు ప్రాధాన్యం ఇచ్చిన ఈ చిత్రం ద్వారా అర్జున్ తన కూతురిని ప్రేక్షకులకు పరిచయం చేయడం గమనార్హం. ఇది కేవలం ఒక సినిమా మాత్రమే కాదు; ఒక తండ్రి తన బిడ్డపై ఉంచిన నమ్మకం, విశ్వాసానికి ప్రతీకగా నిలిచింది.



అరుదైన ఉదాహరణ

తెలుగు చిత్ర పరిశ్రమలో హీరోల కుమారులు పెద్దఎత్తున ఎంట్రీ ఇస్తున్నప్పటికీ, హీరోల కూతుళ్లు మాత్రం చాలా తక్కువ మంది మాత్రమే తెరపైకి వచ్చారు. కుటుంబ గౌరవం, వ్యక్తిగత అభిరుచులు, పరిశ్రమలోని పోటీ వంటి అనేక కారణాలు దీనికి కారణాలుగా చెప్పవచ్చు.

ఈ నేపథ్యంలో అర్జున్ తీసుకున్న నిర్ణయం ఒక ధైర్యవంతమైన అడుగుగా చెప్పుకోవచ్చు. తనకు వచ్చిన స్టార్‌డమ్‌ను మాత్రమే కాదు, అవకాశాన్ని కూడా తన కుమార్తెతో పంచుకోవడం ఆయన ప్రత్యేకతను చూపిస్తుంది.

సినీ రంగంలో వారసత్వం అనేది కొత్త విషయం కాదు. కానీ కుమారులకే పరిమితమైన ఆ వారసత్వాన్ని కుమార్తెలకు కూడా విస్తరించాలనే ఆలోచన అరుదుగా కనిపిస్తుంది. ఆ అరుదైన ఉదాహరణల్లో అర్జున్ పేరు తప్పక ప్రస్తావించాల్సిందే. "ఒకేఒక్కడు"తో వ్యవస్థను కుదిపేసిన హీరో, "సీత పయనం"తో తన కూతురి ప్రయాణానికి శ్రీకారం చుట్టడం విశేషం.

ఇలాంటి ప్రయత్నాలు మరింత మంది స్టార్ కుటుంబాలను ఆలోచింపజేస్తాయనడం అతిశయోక్తి కాదు.

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008





మంచి మార్కులు సాధిస్తే ఐప్యాడ్ గిఫ్ట్

- విజయీభవ కార్యక్రమంలో హామీ
- సిద్దిపేటలో పదో తరగతి విద్యార్థులకు మాజీ మంత్రి హరీష్ రావు ప్రేరణ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 01 : ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో సిద్దిపేటకు మొదటి స్థానం రావాలన్నదే తన లక్ష్యమని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు తెలిపారు.సిద్ధిపేట జిల్లా కేంద్రంలోని ఇందిరా నగర్ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల కోసం నిర్వహించిన 'విజయీభవ' ప్రేరణ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉత్తేజభరిత సందేశం ఇచ్చారు.పదో తరగతి జీవితాన్ని మలుపుతిప్పే కీలక దశ అని పేర్కొన్న ఆయన, మంచి మార్కులు సాధిస్తే భవిష్యత్తు మారుతుందని అన్నారు. "మీ మైండ్‌లో జ్ఞానం ఉండటం మాత్రమే కాదు, పరీక్ష పత్రంపై స్పష్టంగా రాయగలిగితేనే ఫలితం వస్తుంది" అని సూచించారు. చేతిరాత శుభ్రంగా ఉండాలని, చదువుతో పాటు వ్రాయడం కూడా ముఖ్యమని తెలిపారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ఐప్యాడ్లు బహుమతిగా అందజేస్తానని హామీ ఇచ్చారు. సిద్ధిపేట నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి టాప్ ర్యాంకులు సాధించిన 20 మంది విద్యార్థులకు ఐప్యాడ్లు ఇస్తానని ప్రకటించారు. బాసర ట్రిపుల్ ఐటీ సీట్ల విషయంలో సిద్ధిపేట విద్యార్థులు ప్రత్యేక స్థానం సంపాదిస్తున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గం నుంచి 2,875 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారని, ప్రత్యేక తరగతులకు తన స్వంత ఖర్చులతో స్నాక్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తల్లిదండ్రులకు ఫోన్ చేసి టీవీలు ఆపి పిల్లలు చదవాలని సూచించినట్లు తెలిపారు. ఇంట్లో చదవడానికి డిజిటల్ కంటెంట్ పుస్తకాలు అందించామని చెప్పారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద పిల్లలే మెరికలాంటి విద్యార్థులు. ఆత్మవిశ్వాసంతో చదివితే ఎలాంటి లక్ష్యమైనా సాధించవచ్చు. కష్టపడి కాదు, ఇష్టపడి చదవాలి అని హరీష్ రావు విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు రాజనర్స్, కొండం సంపత్ రెడ్డి, మచ్చ వేణు, శర్మ,పాల సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

సంపాదన, పదవులు శాశ్వతం కాదు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 01: చిన్నకోడూరు మండలం అల్లీపూర్ గ్రామ మాజీ సర్పంచ్ బోడిగే అనసూయమ్మ ప్రథమ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి. హరీష్ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అనసూయమ్మ కుమారులు, ఆమె జ్ఞాపకార్థం గ్రామ పంచాయతీకి వైకుంఠ రథం, ఫ్రీజర్ (శవపేటిక)ను ఎమ్మెల్యే హరీష్ రావు సమక్షంలో అందజేశారు.కార్యక్రమంలో మాట్లాడిన హరీష్ రావు "అనసూయమ్మ మన మధ్యలో లేకపోయినా ఆమె చేసిన సేవలు, మంచి పనులు అల్లీపూర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. సంపాదన, పదవులు శాశ్వతం కావు... కానీ ప్రజల కోసం చేసిన సేవ ఎప్పటికీ నిలుస్తుంది అని అన్నారు. అనసూయమ్మ హయాంలో గ్రామ అభివృద్ధి విశేషంగా జరిగిందని, గ్రామానికి రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, ఇతర అభివృద్ధి పనుల కోసం ఆమె నిత్యం తనను కలసి అభ్యర్థించేవారని, గ్రామాభివృద్ధి కోసం నిరంతరం శ్రమించేవారని కొనియాడారు.అల్లీపూర్ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా నిలిపామని, కస్తూర్బా పాఠశాలను ఏర్పాటు చేసి ఇంటర్మీడియట్ స్థాయికి అప్గ్రేడ్ చేసుకున్నామని గుర్తు చేశారు. గ్రామంలో అన్ని కమ్యూనిటీ హాళ్లు నిర్మించుకున్నామని, రహదారుల పనులు దాదాపు పూర్తి చేశామని తెలిపారు.ఇంకా గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. అనసూయమ్మ జ్ఞాపకార్థం ఇలాంటి మంచి కార్యక్రమం నిర్వహించిన వారి కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఇతర గ్రామాలు కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జీత, భత్యాల గురించి మాట్లాడే హక్కు విద్యా కమిషన్‌కు లేదు : పీఆర్టీయూ

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చి 1: రాష్ట్రంలో ఉపాధ్యాయుల జీత, భత్యాల గురించి మాట్లాడే హక్కు నూతనంగా ఏర్పడిన విద్యా కమిషన్ కు,రాష్ట్ర ప్రభుత్వానికి లేదని, పిఆర్టియూ టిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎల్.మల్లారెడ్డి,మెదక్ జిల్లా మాజీ అధ్యక్షులు తాళ్ల శ్రీనివాస్ లు అన్నారు. ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ..ఉపాధ్యాయుల వేతనాలు గత ప్రభుత్వం 78% పెంచిందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఒక్క రూపాయి పెంచకుండా ఎక్కువ వేతనాలు ఉన్నాయని విద్యాకమిషన్ తో అనిపించడం సరైనది కాదన్నారు. ఎక్కువ వేతనాలు ఉన్న ఉద్యోగ విరమణ చేసిన వారికి దక్కవలసిన ప్రయోజనాలు అందక చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.సర్వీస్ నిబంధనలను మార్పులు చేసే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఉపాధ్యాయుల వేతనాల గురించి మాట్లాడే ముందు చాలా రోజులుగా పెండింగ్ లో ఉన్న సమస్యల పరిష్కారం పై విద్యా కమిషనర్ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో పిఆర్టియు బాధ్యులు నందరాం,రఘుబాబు, సంగమేశ్వర్ లు ఉన్నారు.



వర్గీకరణ పోరాట అమర వీరులకు ఘన నివాళులు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 01: ఎస్సీ వర్గీకరణ సాధనలో ప్రాణత్యాగం చేసిన మాదిగ అమర వీరులకు ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్సీ రిజర్వేషన్లను ఏబిసిడీలుగా వర్గీకరించాలని, పార్లమెంట్ లో బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ సాగిన ఉద్యమాల్లో అమరులైన పొన్నాల సురేందర్ మాదిగ, దామోదర్ మాదిగ, మహేష్ మాదిగ మరియు హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ ముట్టడిలో భాగంగా జరిగిన లాఠీచార్జ్‌లో గాయపడి మృతి చెందిన దర్శనాల భారతి మాదిగ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ విషయంలో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడాన్ని నిరసిస్తూ జరిగిన ఉద్యమాల్లో ప్రాణత్యాగాలు చోటుచేసుకున్నాయని తెలిపారు. అలాగే తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు అమరుల త్యాగాలు, ఉద్యమకారుల నిరంతర పోరాటాల ఫలితమని పేర్కొన్నారు.ప్రస్తుతం తెలంగాణలో అమలవుతున్న 15 శాతం ఎస్సీ రిజర్వేషన్లను జనాభా నిష్పత్తి ప్రకారం పెంచాలని, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో మాదిగ ఉపకులాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ముక్కపల్లి రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు మల్లిగారి యాదగిరి మాదిగ , పెర్క పరశురాం, సామ్రాట్ ప్రకాష్, జేపీ లక్ష్మణ్ , కొలిమి మల్లేశం, బింగి పవన్ కళ్యాణ్ , మాదాస్ బాబు, బయ్యారం యాదగిరి, శ్రీనివాస్, రాములు, మల్లయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.



మాజీ మున్సిపల్ చైర్మన్‌ను పరామర్శించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 01 : మెదక్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్ పైన రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగంగా అక్రమ కేసులు బనాయించి శనివారం మెదక్ టౌన్ పోలీస్ లు మల్లికార్జున్ గౌడ్ ఇంట్లో చొరబడి అన్యాయంగా, అక్రమంగా అరెస్ట్ చేసి, కుటుంబ సభ్యులని భయపెట్టి, అసభ్యంగా ప్రవర్తించి అరెస్ట్ చేసిన విషయం తెలిసిదే. శనివారం మధ్యాహ్నం కోర్టు బెల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఆదివారం మెదక్ పట్టణంలోని మల్లికార్జున్ గౌడ్ ను వారి నివాసం లో స్థానిక నాయకులతో కలిసి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మెదక్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ కంఠారెడ్డి తిరుపతి రెడ్డి పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించి మున్సిపాలిటీ కైవసం చేసుకుంటాది అని తెలిసి స్థానిక ఎమ్మెల్యే వారి అనుచరులు, బీఆర్ఎస్ నాయకులపైన పోలీసుల అండతో అక్రమంగా కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేసి ఎలాగైనా గెలవాలని అడ్డదారులు తొక్కిన ప్రజలు వాళ్లను నమ్మలేరు బిఆర్ఎస్ పార్టీ కన్నా ఒక సీటు కాంగ్రెస్ పార్టీకి తక్కువనే వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్రమ కేసులు పెట్టిన చివరికి న్యాయస్థానంలో న్యాయమే గెలిచింది అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపైన ఎన్ని అక్రమ కేసులు పెట్టిన చివరకు ప్రజల మద్దతు బీఆర్ఎస్ కె ఉందని, రాజకీయంగా ఎదుర్కోలేక ఇలా చిల్లర కేసులతో కక్ష సాధింపు చర్యలతో అక్రమంగా కేసులకు పాల్పడుతున్నారు. ఇకనైనా కక్ష సాధింపు చర్యలు మని పాలన పైన దృష్టి పెట్టి, అభివృద్ధి చేయాలని ఇచ్చిన హామీలను అమలు చేయాలని హెచ్చరించారు.మున్సిపల్ ఎన్నికల సమయంలో అధికారపార్టీ ఎమ్మెల్యే, స్థానిక కాంగ్రెస్ నాయకులు కోడ్ ఉల్లగించిన,డబ్బులు పంపిణీ చెందిన పోలీసులు వారి పైన ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు, పోలీసులు అధికారపార్టీ కార్యకర్తలుగా పనిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకుల, కార్యకర్తల పైన ఎన్ని కేసులు పెట్టిన చివరగా న్యాయ స్థానంలో న్యాయమే గెలుస్తాది అని తెలియజేసారు ,పార్టీ నాయకులు , కార్యకర్తలు అధైర్యపడద్దు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. వీరి వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కసిరెడ్డి మాణిక్య రెడ్డి,ఏడుపాయల దేవస్థాన మాజీ చైర్మెన్ సాతెల్లి బాలాగౌడ్,మాజీ పిఏసిఎస్ చైర్మెన్ కల్వకుంట గ్రామ సర్పంచ్ అందే. కొండల్ రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీష్, నాయకులు నర్సింలు, చంద్రమోహన్ గౌడ్, గంజి. నవీన్, వడ్ల. నాగరాజు, నాగరాజు, వినయ్, తలారి సంతోష్, మెకానిక్ రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.



నేటి నుంచి కలెక్టరేట్‌లో యధావిధిగా ప్రజావాణి..

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చి 1: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం నేటి నుంచి యధావిధిగా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేసిన ప్రజావాణి కార్యక్రమంను సోమవారం నుండి సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో యధావిధిగా ప్రజావాణి కొనసాగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.జిల్లా అధికారులందరూ సమయపాలనతో తప్పనిసరిగా ప్రజావాణికి హాజరుకావాలని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 01 : సిద్దిపేట పట్టణం, 41వ వార్డుకు చెందిన అంబటి సురేష్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న బి. రమేష్ ఫౌండేషన్ సభ్యులు మానవత్వాన్ని చాటుతూ ముందుకు వచ్చారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాన్ని పరామర్శించి, తక్షణ సహాయంగా రూ.5,000 నగదు అందజేశారు.అంబటి సురేష్‌కు ముగ్గురు ఆడపిల్లలు ఉండగా, కుటుంబ పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని స్థానికులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఫౌండేషన్ ప్రతినిధులు బాసంగారి వెంకట్ వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.రోగి పరిస్థితిని మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు దృష్టికి తీసుకు వెళ్తాను తెలిపారు. అలాగే ఇతర స్వచ్ఛంద సంస్థల సహకారంతో వైద్యానికి అవసరమైన ఖర్చులను సమకూర్చేందుకు కృషి చేస్తామని వారికి ధైర్యాన్ని కలిగించారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ,



గతంలో కూడా పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించాము సమాజంలో ఇలాంటి బాధితులకు ప్రతి ఒక్కరూ తమవంతు సహాయం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంతోష్,భోగి శ్రీనివాస్ పాల్గొన్నారు.



విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రతి పక్షం దుబ్బాక మార్చి 01: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని డి సి ఓ డాక్టర్ శారద వెంకటేష్ , మండల విద్యాధికారి ప్రభుదాస్ లు తెలిపారు. శనివారం దుబ్బాక లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల/ కళాశాల ప్రిన్సిపాల్ డి . సుజాత ఆధ్వర్యం లో నిర్వహించిన విద్యార్థుల వీడ్కోలు సమావేశం లో ముఖ్య అతిథిలుగా వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని తల్లి దండ్రులకు, చదువు చెప్పినటువంటి గురువులకు మంచి పేరు తెచ్చి విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.అంతకుముందు నూతన ఎన్నికైన మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీరాం సంగీత రవీందర్, వైస్ చైర్మన్ ఆ స సులోచన స్వామి లను పాఠశాల ఉపాధ్యాయ బృందం శాలువాతో ఘనంగా సన్మానించారు . ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎస్సైని పరామర్శించిన 'వంటేరు'

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చి 1: పదవి విరమణ తర్వాత ప్రభుత్వం అందించాల్సిన ఆర్థిక సహాయం అందక, వయోభారంతో అనారోగ్యం వెంటాడుతున్నరిటైర్డ్ ఎస్సై ఇస్మాయిల్ ను ఆదివారం నాడు నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి పరామర్శించి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండించారు. 18 వ వార్డ్ కౌన్సిలర్ శ్రీధర్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు ఆయన కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి ని వ్యక్తపరుస్తూ ప్రభుత్వం నుంచి వచ్చే డబ్బులపై పోలీస్ శాఖ అధికారులతో మాట్లాడి రిటైర్మెంట్ డబ్బులు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ గోలి మమత సంతోష్ , మాజీ కౌన్సిలర్ రహీం , మాజీ కో ఆప్షన్ ఇస్మాయిల్, గజ్వేల్ టౌన్ అధ్యక్షులు నవాజ్ మీరా, గడియారం స్వామి, నవాజ్, సింగం, షాదుల్లా, రషీద్ పాల్గొన్నారు.



అమ్మదయ ఉంటే అన్ని ఉన్నట్టే..

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషను చైర్మెన్ బక్కి వెంకటయ్య

ప్రతి పక్షం దుబ్బాక మార్చి 01: అమ్మ దయ ఉంటే అన్ని ఉన్నట్టే అని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషను చైర్మెన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఆదివారం దుబ్బాక మండల పరిధిలోని గంబీర్ పూర్ గ్రామం లోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పెద్దమ్మ పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామంలోని అంబేద్కర్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ను ముదిరాజ్ సంఘ కులస్తులు, అంబేద్కర్ సంఘ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు బాణాల శ్రీనివాస్,ముదిరాజ్ సంఘం అధ్యక్షులు భాస్కర్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు మైసయ్య,లింగం,బాలయ్య, పర్శరాములు తది తరులు పాల్గొన్నారు.





ఇరాన్‌పై యుద్ధం నేపథ్యంలో ఒకే దెబ్బకు 48 మంది ఇరాన్ నేతలను అంతమొందించాం. అమెరికా-ఇజ్రాయెల్ సాధించిన విజయాన్ని ఎవరూ నమ్మలేరు. ఊహించిన దానికంటే సైనిక ఆపరేషన్ వేగంగా కొనసాగుతోంది. ఇరాన్ నేతలు తనతో మాట్లాడాలని అనుకుంటున్నారు, ఆ దేశంతో చర్చలకు మేం సిద్ధం.

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

ప్రాంతీయం



జర్నలిస్టులపై ప్రభుత్వం చిన్నచూపు

- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 01 : కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక జర్నలిస్టులను చిన్నచూపు చూస్తోందని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శించారు. సిద్దిపేటలోని క్రికెట్ స్టేడియంలో కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న "కేసీఆర్ క్రికెట్ ట్రోఫీ-సీజన్ 5" టోర్నీని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మైదానంలోకి దిగిన ఆయన కాసేపు బ్యాట్ పట్టి ఆటగాళ్లతో కలిసి క్రికెట్ ఆడి సందడి చేశారు. అనంతరం సిద్దిపేట మినీ స్టేడియంలో తెలంగాణ సాంప్రదాయ ఆట సిర్రగోనే (కర్రబిళ్ళ) ఆడుతూ సరదాగా గడిపారు.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ...రాష్ట్ర సాధకుడు కేసీఆర్ జన్మదినం సందర్భంగా ప్రతి ఏడాది క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ టోర్నీలో జర్నలిస్టులు పాల్గొనడం ఆనందకరమని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వారు రాత్రింబవళ్లు కృషి చేస్తున్నారని కొనియాడారు. కొత్త అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వలేదని, ఇప్పటికే ఉన్న వాటిని రద్దు చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఉద్యోగులతో పాటు జర్నలిస్టులను హెల్త్ స్కీమ్‌లో భాగస్వామ్యం చేయకపోవడం దురదృష్టకరమన్నారు.కేసీఆర్ హయాంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని, సంక్షేమ నిధికి కోట్ల రూపాయలు కేటాయించారని గుర్తుచేశారు. జర్నలిస్టుల కోసం కేటాయించిన రూ.16 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.రేవంత్ రెడ్డి గెలిచిన తర్వాత యూట్యూబ్ జర్నలిస్టుల పట్ల అనుచితంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ, వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో జర్నలిస్టుల సమస్యలపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అంతకు ముందు ఇటీవల జరిగిన జర్నలిస్ట్ క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు అందజేశారు.



మెదక్ జిల్లాలో జూదంపై ఉక్కుపాదం

- టాస్క్ ఫోర్స్ దాడుల్లో 9 మంది అరెస్ట్
- రూ.28,296 నగదు, 6 మొబైల్ ఫోన్లు, ఒక కారు, 5 బైక్లు స్వాధీనం
- మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు

ప్రతిపక్షం,ప్రతినిధి మెదక్,మార్చ్1: మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం బుజరాంగ్‌పల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వారిపై టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి 9 మందిని అరెస్ట్ చేశారు.విశ్వసనీయ సమాచారం ఆధారంగా టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో 9 మంది జూదగాళ్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.28,296 నగదు మరియు 6 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.అరెస్టయిన వారిని వడ్ల ఎల్లం, వంజరి మల్లేశం, ఉసికె దుర్గేష్, బక్క వీరేశం, మహంకాళి ప్రకాష్, గుడాల హరి, పనిముక్కల రామ్, శశిధర్ గౌడ్, గంగారాం,మల్లేశం,జాతీగరి కృష్ణగా పోలీసులు గుర్తించారు. వారిని కౌడిపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..జిల్లాలో పేకాట, బెట్టింగ్ వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి అక్రమాల వల్ల అనేక కుటుంబాలు నష్టపోతున్నాయని, ముఖ్యంగా యువత తప్పుదారుల్లోకి వెళ్లకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించి ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

జూదం స్థావరంపై దాడి

ప్రతిపక్షం, గజ్వేల్ (వర్గల్), మార్చి 1: నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ బృందం, గౌరారం పోలీసులు ఆదివారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మైలారం గ్రామంలో ఆకస్మిక దాడి నిర్వహించింది.గ్రామానికి చెందిన పిట్ల మధు ఇంట్లో అక్రమంగా "హెడ్ అండ్ టెయిల్స్" (కాయిన్ టాసింగ్) జూదం ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో 3 లక్షల,93 వేల 820 నగదుతో పాటు 3 మొబైల్ ఫోన్లు, బొలెరో వాహనం మరియు ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులపై కేసు నమోదు చేసి



దర్యాప్తు చేస్తున్నట్లు గౌరారం పోలీస్ స్టేషన్ ఎస్సై కరుణాకర్ రెడ్డి తెలియజేశారు. సమాజంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉగాది వేడుకలకు రావాలని ఆహ్వానం

ప్రతిపక్షం, చేగుంట, మార్చి 1: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదిన వేడుకలకు హాజరుకావాలని మంత్రులకు శాసనసభ్యులకు నాచారం లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కమిటీ ఆహ్వానం అందజేసింది. లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్తా సమక్షంలో జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి మంత్రి కొండా సురేఖ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అనిల్ యాదవ్ మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డికి ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మోడల్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

ప్రతిపక్షం, చేగుంట, మార్చి 1: చేగుంట మండల కేంద్రంలోని మోడల్ పాఠశాల కళాశాల విద్యార్థులకు పరీక్ష ఫ్యాడ్ లను చేగుంట ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీక్ పంపిణీ చేశారు. గత రెండు సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలతో ముందుకు వెళుతున్న మహమ్మద్ రఫీ అన్ని వర్గాల వారికి సేవలు అందిస్తున్నారు. మహమ్మద్ రఫిక్ మోడల్ పాఠశాల విద్యార్థులకు పరీక్ష ఫ్యాడ్లు పంపిణీ చేయడంతో పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ అధ్యాపకులు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల సమయంలో చంపాడానికి స్కెచ్

- సిద్దిపేటలో డ్రమ్స్ కొడితే మెదక్ లో ఆటలాడుతున్నారు
- సింపతీ కోసం హైడ్రామా .. చట్టం ఎవరికి చుట్టం కాదు
- మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేష్ గౌడ్



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చ్ 01 : మెదక్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 15వ వార్డులో పోటీ ఉన్న తనపై గొడ్డలితో హత్యాయత్నం జరిగిందని మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ ఆరోపించారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తనపై జరిగిన దాడి దృశ్యాలు వీడియోల్లో స్పష్టంగా ఉన్నాయని పేర్కొన్నారు. వందలాది మందితో దాడులు చేసేందుకు సిద్దిపేట నుంచి కుట్ర పన్నారని, ఈ దాడుల వెనుక పెద్ద స్కెచ్ ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో వైరల్ చేసింది భారత రాష్ట్ర సమితి నాయకులేనని తనపై గొడ్డలితో అత్త ప్రయత్నం చేయడానికి చుట్టూ 20 మంది చేరుకోవడం జరిగిందని వాస్తవాలు ప్రజల్లోకి వెళ్లడం లేదని, వాస్తవమేదో అవాస్తవమేదో ప్రజలకు చేరాల్సిన అవసరం ఉందని అన్నారు. అక్రమ అరెస్టులు దాడులు అంటున్నారని ఈరోజు జరుగుతున్న పరిణామాలన్ని ఓడిపోయిన వ్యక్తులు సింపతి పొందడానికే చేస్తున్న కుట్రలన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాత్రి 15 వార్డు లో పదుల సంఖ్యలో మల్లికార్జున్ గౌడ్ తన అనుచరులను పెట్టుకొని మా మద్దతు దారులైన ఓ మహిళ ఇంటి ముందు చేరి భయభ్రాంతులకు గురి చేశారనే సమాచారాన్ని అందుకున్న ఎమ్మెల్యే ఆమెను పరామర్శించేందుకు రావడం జరిగిందని అన్నారు. ఎమ్మెల్యే అక్కడికి వచ్చింది డబ్బులు పంచేందుకు కాదని ఆయనకు డబ్బులు పంచాల్సిన అవసరం ఏముంటుందన్నారు. తనపై దాడి జరిగిన రాత్రి ఏం జరిగిందనే వాస్తవాన్ని ప్రజలకు ఎందుకు తీసుకెళ్లలేక పోతున్నారని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే పై దాడి జరిగిన రాత్రి మల్లికార్జున్ గౌడ్ తన అనుచరులను గుంపులు గుంపులుగా ఏర్పాటు చేసి ఎవరు వస్తే వారిపై దాడులు చేసేందుకు సిద్ధమయ్యారని, సిద్దిపేటలో హరీష్ రావు వేసిన స్కెచ్ ను ఇక్కడ అమలు చేశారన్నారు. నాపై గొడ్డలి తీసుకుని భయభ్రాంతులకు గురి చేసి చంపే, కుట్ర చేశారని అన్నారు. దాడి చేసిన వారిపై ఎలాంటి పిర్యాదు చేయలేదని మీరే ఫోటో లు, వీడియోలు తీసి మీరే కదా ఫోన్ ద్వారా షేర్ చేసింది మీరు కదా అన్నారు. ఎమ్మెల్యే వాహనం పై, తన పై దాడులు జరిగిన విషయం వాస్తవం కాదా అవి మీకెందుకు కళ్లకు కనబడడం లేదు అన్నారు. ఆరోజు జరిగిన దాడిపై ఎక్కడ స్పందించకూడదని దీనికి ప్రజలే సరైన సమాధానం చెబుతున్నారని దానికి అనుగుణంగానే ప్రజలు మంచి మెజారిటీతో గెలిపించారన్నారు. మీరు సోషల్ మీడియాలో వైరల్ చేసిన వీడియోలో చాలా మంది ఉన్నారని మేము ఏ ఒక్కరిపై కూడా ఫిర్యాదు చేయలేదని అన్నారు. మీరు ప్రోత్సహిస్తే నాపై దాడులకు పాల్పడ్డ వ్యక్తులు లోపల ఉంటారు ఎట్లా, మీరు బయట ఉంటారు ఎట్లా అని, వారికి బెయిల్ ఎందుకు రాలేదు మీకు బెయిల్ ఎలా వచ్చిందని ఆయన ప్రశ్నించారు. జైల్లో ఉన్న వారి కుటుంబ సభ్యుల సింపతి పొందేందుకే ఇలాంటి డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని పట్టణానికి కావాల్సిన నిధులను సైతం తీసుకు వస్తున్నారని ఇవన్నీ చూసి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. మెదక్ నియోజకవర్గంలోని మెదక్, రామయంపేట్ మున్సిపాలిటీలోనూ కాంగ్రెస్ జెండా ఎగరడానికి స్థానిక ఎమ్మెల్యే రోహిత్ రావు, మైనంపల్లి హనుమంతరావు కారణమన్నారు. ఇక మీదట కాంగ్రెస్ పార్టీ, స్థానిక ఎమ్మెల్యే, హనుమంతరావు లపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లయితే సహించేది లేదన్నారు. మల్లికార్జున్ గౌడ్ మెదక్ మున్సిపల్ చైర్మన్ గా పని చేసినప్పుడు కాంట్రాక్టర్లుగా తన బంధువులను కుసి సి రోడ్డు మురికి కాలువల నిర్మాణాన్ని అప్పజెప్పలేదని ఆయన ప్రశ్నించారు అధిక మొత్తంలో తన కాంట్రాక్టర్కు అప్పజెప్పడం జరిగిందని ఆయన విమర్శించారు మున్సిపల్ ఉద్యోగులలో తన బంధువులను అవకాశం కల్పించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు ఏ రోజు కూడా ప్రజల కోసం ప్రజా ప్రజా శ్రేయస్సు కోసం పనిచేయలేదని అయినా తీవ్రంగా విమర్శించారు ఒకవేళ పని చేసినట్లయితే మీకు మరోసారి ప్రజలు పట్టం కట్టే వారిని మీరు మీ కుటుంబ సభ్యులు బంధువులను మాత్రమే ప్రోత్సహించుకున్నారని అన్నారు. మీ అంతల మీరే బయటికి వచ్చి హై డ్రామా చేస్తారని, లోపలికి వెళ్లి నవ్వుకుంటురని, దీంతో ఎవరి తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. ఇప్పటి నుండి తమ పై ఎలాంటి అసత్య ఆరోపణలు చేసిన, దాడులకు తెగబడిన దాడులకు ప్రతి దాడులు ఉంటాయని హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రావు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గంగాధర్ మాట్లాడుతూ గత పది సంవత్సరాల పాలనలో నియోజకవర్గంలో ఎన్ని రకాల దోచుకోవాలో అన్ని రకాలుగా దోచుకున్నారని 10 సంవత్సరాలకు ముందు మీ ఆస్తుపాస్తులు ఎంత ఇప్పుడున్న ఆస్తిపస్సులు ఎంత వాని ప్రజలకు తెలుసా నీ వారు అన్నారు నియోజకవర్గంలో ఎక్కడ కూడా కాంట్రాక్టర్ల వద్ద డబ్బులు వసూలు చేసింది ఎవరో ప్రజలకు తెలుసు అని రోడ్డు కాంట్రాక్టర్లు మూడుసార్లు ఒక్కరికే రావడం వారి వద్ద నుండి డబ్బులు వసూలు చేసింది ప్రజలకు తెలుసు అని వారు తెలిపారు సిద్దిపేటలో డ్రమ్స్ వాయిస్తే ఇక్కడ డాన్సులు చేసేది మీరే కదా అని సిద్దిపేటలో స్కెచ్ వేస్తే ఇక్కడ అమలు చేసేది మీరే కదా అని వారు తీవ్రంగా విమర్శించారు నియోజకవర్గం ఎప్పుడు పట్టించుకున్న పాపాన పోలేదని ఎప్పుడో నిధులు వచ్చిన సిద్దిపేటకు సిరిసిల్ల గజ్వేల్ కు తరలించకపోయిన చరిత్ర బీఆర్ఎస్ నాయకులదని వారు తెలిపారు కేవలం రెడ్డి సంవత్సరాలలో కాంగ్రెస్ పాలనలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ 187 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నామని వారు అన్నారు అభివృద్ధి విషయంలో ముందుకు పోతుంటే ఓర్చుకోలేని మీరు రాజకీయ కక్షలు అంటూ ఎమ్మెల్యే పై ఆరోపణలు చేయడం సరైనటువంటి విధానం కాదని వారు తెలిపారు. మున్సిపల్ ఎన్నికలు శాంతియుతంగా జరుగుతూ ఉంటే సిద్దిపేటలో స్కెచ్ వేసి మెదక్లో అమలుపరిచింది మీరే కదా అని సిద్దిపేట నుండి గుండాలు రౌడీలు వచ్చి మెదక్లో కాంగ్రెస్ కార్యకర్తల పైన దాడులు చేసింది మీరే కదా అని తీవ్రంగా విమర్శించారు సిద్దిపేట సిరిసిల్ల గజ్వేల్ లో దళిత బందును ఇవ్వడం జరిగింది మెదక్ నియోజకవర్గంలో ఎందుకు ఇవ్వలేదని ఈరోజు దళితుల కోసం మాట్లాడే హక్కు మీకు లేదని వారు అన్నారు. గత పది సంవత్సరాల లో నియోజకవర్గంలో లంచగొండి పాలన కొనసాగించాలని ప్రతి కాంట్రాక్టర్ల వద్ద డబ్బులు వసూలు చేసింది మీరే కదా అని అడిగిన వారిని అణిచి వేయడం మీ పాలనలో జరిగిందని వారు తీవ్రంగా విమర్శించారు ప్రశాంతంగా ఉన్న పట్టణాన్ని మీ స్వార్థ రాజకీయాల కోసం ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని వారు తీవ్రంగా విమర్శించారు. మాజీ మంత్రి హరీష్ రావు మెదక్ పై కన్ను వేశాడని ఆయన కనుసైగలలో మెదక్ పట్టణ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న ఘనత భారత రాష్ట్ర సమితికి దక్కిందని వారు అన్నారు. చట్టం ఎవరికి చుట్టాం కాదని చట్టం తన పని చేసుకోపోతుందని వారు తెలిపారు గత పది సంవత్సరాల పాలనలో పద్మ దేవేందర్ రెడ్డి ఆమె భర్త దేవేందర్ రెడ్డి చేసిన భూ కబ్జాలు. కాంట్రాక్టర్ల దగ్గర వసూలు చేసిన కార్యక్రమాన్ని ప్రజలకు వివరించడం జరుగుతుందని మా జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదని వారు తీవ్రంగా హెచ్చరించారు ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు మ్యాడమ్ బాలకృష్ణ. మెదక్ మున్సిపల్ కౌన్సిలర్లు. హరిత. గంట సంపత్.మన్సూర్, శశాంక్ తేజ.భుజరంపేట్ అరుణ సిద్ధిరాములు. గోదల సాయి. నాయకులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్. మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ గౌడ్. యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి దయాసాగర్. నవీన్ చౌదరి పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో భక్తుల రద్దీ

ప్రతిపక్షం, కొమురవెల్లి, మార్చి 01: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ ఆదివారంకు భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. దీంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. స్వామి వారి దర్శనానికి సుమారు 40 వేల భక్తులు తరలివచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రం నుంచే క్షేత్రానికి భక్తులు చేరుకున్నారు. ఆలయ గదులు, ప్రయవేటు వసతి గదులలో బస చేసిన భక్తులు ఆదివారం వేకువజాము నుంచే మల్లన్న పుష్కరిణి లో స్నానాలు చేసి స్వామి వారి దర్శనానికి వెళ్ళారు. కొంత భక్తులు శ్రీమల్లికార్జునస్వామికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు, పట్నాలు వేసి, ఒడిబియ్యం పోసి, కేశఖండన, గంగిరేణు చెట్టు వద్ద పట్నాలు వేసి, ముడుపులు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. మరికొంత భక్తులు శ్రీమల్లికార్జున స్వామికి మట్టికుండలలో బోనం తయారు చేసి మల్లికార్జునస్వామితో పాటు మల్లన్న కొండపైన ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లికి సమర్పించి మొక్కులు సమర్పించారు. అనంతరం రాతి గీరల వద్ద ప్రదక్షణలు, కోడెల స్థంభం వద్ద కోడెలు



కట్టి పూజలు చేశారు, స్వామి దర్శనానికి సుమారు 4 గంటల సమయం పట్టింది. భక్తులకు కావల్సిన సౌకర్యాలను ఈవో కృష్ణప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, ఏఈఓలు బుద్ధి శ్రీనివాస్, రావుల సుదర్శన్, సూపరింటెంట్ నీల శేఖర్, ఆలయు ధర్మకర్తల మండలి చైర్మన్ గంగం నరిసింహ్మారెడ్డి, ధర్మకర్తలు సార్ల లింగం, బొచ్చు ఎల్లయ్య, రావికంటి సత్యనారాయణ, ఆలయ సిబ్బంది అర్చకులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

ఆలయ అభివృద్ధికి కృషి : పొన్నం

ప్రతిపక్షం, కొమురవెల్లి, మార్చి 01: కొమురవెల్లి మల్లన్న ఆలయ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర బీసి సంక్షేమ, రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. ఆదివారం కుటుంబసమేతంగా మల్లికార్జునస్వామిని దర్శించుకని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ కృష్ణ ప్రసాద్, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలుకగా ఆలయంలో పట్నం వేసి, బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆలయంలో నిర్మాణం చేపడుతున్న 50 వసతి గదులు, క్యూకాంప్లేక్స్ పనులు చివరి దశకు చేరుకున్నాయని, తర్వలోనే వాటిని ప్రారంభించి భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. కొమురవెల్లి మల్లన్న బడుగు, బలహీన వర్గాల దేవుడని, రానున్న రోజులలో ప్రణాళిక బద్ధంగా ఆలయాన్ని అభివృద్ధి చేస్తూ, అన్ని కుల సంఘాలకు భవనాలు నిర్మించేందకు కృషి చేస్తానని తెలిపారు.



విద్యావంతులు రాజకీయాల్లోకి రావాలి

సమాజాభివృద్ధి కోసం విద్యావంతులు రాజకీయాలలోకి రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాజకీయ పార్టీలు ప్రతి విషయంలో విమర్శలు చేసిన తప్పులేదని దేశ భవిష్యత్తుకు మూలమైన విద్యపై రాజకీయ విమర్శలు చేయడం సరికాదన్నారు. విద్యా కమిషన్ ఇచ్చిన నివేదికలో తప్పులు ఉంటే రాజకీయ నాయకులు సలహాలు, సూచనలు ఇవ్వకుండా విమర్శించడం సిగ్గుచేటని అన్నారు. యూనివర్సిటీల్లో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని విద్య కమిషన్ ఇచ్చిన నివేదికను తాను స్వాగతిస్తున్నానని, విద్యార్థి సంఘ నాయకుని స్థాయి నుంచి తాను మంత్రి స్థాయికి ఎదిగానని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహదేవుని శ్రీనివాస్, ఆలయ చైర్మన్ గంగం నర్సింహ్మారెడ్డి, మాజీ జడ్పీటీసీలు కొమ్ము నర్సింగరావు, గిరి కొండల్ రెడ్డి, నాయకులు లింగంపల్లి శ్రీనివాస్, లింగంపల్లి కనకరాజు, గుండా మహేష్, ఎర్వుల రాజు, బొచ్చు ఎల్లయ్య, సార్ల లింగం, రమేష్, వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

సంతలో ఐదు తులాల బంగారు నగల చోరీ

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 01: మెదక్ మండలం మాంబోజీ పల్లి సంతలో 5తులాల బంగారు ఆభరణాలు చోరి అయిన సంఘటన శనివారం సాయంత్రం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రమైన కొల్చారంకు చెందిన చింతలగారి శ్రావణి ప్రవీణ్ భార్య భర్తలు మెదక్ వెళ్లి తిరిగి ప్రయాణం లో సంతలో కూరగాయలు తీసుకోవడానికి వెళ్ళారు. తమ వద్ద ఉన్న హాండ్ బ్యాగులో ఉన్న రూ.8లక్షల విలువ గల 5తులాల బంగారు నగలు నెక్లెస్ 2.5, నల్లపూసలు 2తులలు,మాటిలు,చెవి కమ్మలు అర తులం చోరి జరిగాయి . బాధితులు కొద్దిసేపటి కి హ్యాండ్ బ్యాగ్ చూడగా కనిపించకుండా పోవడంతో కంగుతిన్న బాధితులు మెదక్ లో రూరల్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై లింగం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్ట్

ప్రతిపక్షం, చేగుంట, మార్చి 1: జులాయిగా తిరుగుతూ భార్యను వేధిస్తూ చివరకు హత్య చేసిన సంఘటనలో భర్తను అరెస్టు చేసినట్లు రామాయంపేట సిఐ వెంకట్రాజా గౌడ్ తెలిపారు. వెంకట్రాజగౌడ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చేగుంటలో నివాసముంటున్న ముఠా త్రిమూర్తి వరలక్ష్మి దంపతులు నిత్యం గొడవ పడుతూ ఉండేవారు. ఫిబ్రవరి 21 తేదీన వరలక్ష్మి ఆమె భర్త ముఠా త్రిమూర్తి మధ్య గొడవ జరిగింది. భార్యా వరలక్ష్మి కుమారుడు దుర్గాప్రసాద్ నిద్రిస్తున్న సమయంలో వరలక్ష్మిని పారతో నరికి హత్య చేసి వంటిపై ఉన్న బంగారు ఆభరణాలను నగదును తీసుకొని అన్నవరం పారిపోయారు. ఆదివారం చేగుంట బస్టాండ్ వద్ద తిరుగుతుండగా పోలీసులు పట్టుకున్నారు. త్రిమూర్తులు నుండి బంగారు ఆభరణాలు నగదును సెల్ఫోన్ రికవరీ చేసుకున్నారు. త్రిమూర్తిని అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపారు.



"



'మునుగోడుకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు. విద్యావ్యవస్థలో మార్పులు తెస్తున్నారు. గత ప్రభుత్వం విద్యను గాలికి వదిలేసింది, హైదరాబాద్‌కు పక్కనే ఉన్న మునుగోడును పట్టించుకోవడందు. అభివృద్ధిలో ఇంకా వెనుకబడి ఉంది.

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

క్రీడలు ఉత్సాహాన్ని కలిగిస్తాయి

- జిల్లాలో టైక్వాండో క్రీడ పోటీలు అభినందనీయం
- మేయర్ కూరగాయల ఉమాదేవి



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 01:- జిల్లాలో ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా టైక్వాండో క్రీడ పోటీలో పాల్గొంటున్న విద్యార్థులు క్రీడాకారులు తమ నైపుణ్యం ప్రదర్శించి జిల్లాకు వన్నె తీసుకురావాలని నిజామాబాద్ నగర మేయర్ కూరగాయల ఉమాదేవి అన్నారు. ఆదివారం నగరంలోని టైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టైక్వాండో అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్ పవర్, టైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీర్ వహజ్ అలీ ఖాన్, రాష్ట్ర అబ్జర్వర్ ముస్తఫా లు హాజరయ్యారు. నగరంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2వ తైక్వాండో జిల్లా ఛాంపియన్షిప్ పోటీలను మేయర్ ప్రారంభించారు. జిల్లా స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని నగర మేయర్ ఉమారాణి అన్నారు. కరాటే, తైక్వాండో వంటి క్రీడలు ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడతాయని, విద్యార్థి దశ నుంచే శిక్షణ తీసుకుంటే శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు. ఇలాంటి టోర్నమెంట్లను సద్వినియోగం చేసుకుంటే క్రీడాకారులు భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ చైర్మన్ రమేష్ పవర్ మాట్లాడుతూ జిల్లాలో తైక్వాండో అభివృద్ధి కోసం మరిన్ని శిక్షణ శిబిరాలు, ప్రతిభావంతుల ఎంపిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా క్రీడాకారులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు అజ్మత్ ఖాన్ మాట్లాడుతూ యువతలో ఆత్మరక్షణ నైపుణ్యాలు పెంపొందించడమే తైక్వాండో ప్రధాన లక్ష్యమని, జిల్లా స్థాయిలో నిరంతరం పోటీలు నిర్వహిస్తూ ప్రతిభను వెలికితీస్తామని తెలిపారు. ప్రధాన కార్యదర్శి వినోద్ మాట్లాడుతూ క్రీడాకారులకు నాణ్యమైన శిక్షణ అందించేందుకు అనుభవజ్ఞులైన కోచ్‌లను అందుబాటులో ఉంచుతున్నామని, తల్లిదండ్రులు పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మీర్ వాహజాద్ అలీ మాట్లాడుతూ తైక్వాండో క్రీడ రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతోందని, జిల్లా స్థాయి పోటీలు ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడానికి మంచి వేదికగా నిలుస్తాయని అన్నారు. క్రమశిక్షణ, కఠిన సాధనతో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. ముగింపు సమావేశంలో గెలుపొందిన క్రీడాకారులకు జిల్లా ఒలంపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నరసయ్య, జిల్లా టైక్వాండో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వాగ్మారే సుభాష్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్, క్రీడాకారులు, కోచ్‌లు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేశారు.



మహిళల సమగ్ర అభివృద్ధికి సర్కారు కృషి

టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 01 : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి అన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యోద్దేశమని టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. ఆదివారం సదాశివపేట మండలం చందాపూర్ గ్రామం లో ఆమె పర్యటించారు. గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సిసి రోడ్, మహిళా సమాఖ్య భవనానికి, స్కూల్ కాంపౌండ్ నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. అదేవిధంగా గ్రామ ప్రజల కోసం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ను నిర్మలా జగ్గారెడ్డి ప్రారంభించారు. అదేవిధంగా గ్రామం లో ఇటీవలే నిర్మించిన రెండు ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే మహిళలకుఉచిత బస్సు అవకాశం కల్పించింది అన్నారు. మహిళలకు పావులా వడ్డీ రుణాలు, మహిళా సంఘాలకు పక్కా భవనాలు, పెట్రోల్ బంక్ లను సైతం ఏర్పాటు చేసిందన్నారు. భవిష్యత్తులో మహిళా సంఘాలకు బస్సులు కేటాయించి మహిళల తో నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందన్నారు. ఇలా ప్రతీ విషయంలో మహిళల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతుంది అన్నారు. ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్దన్న, గ్రామ సర్పంచ్ పట్లోల్ల మల్లేష్ , ఉప సర్పంచ్ , వార్డు మెంబర్లు , మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



7 ఏళ్ల బాలుడి హత్య కేసు ఛేదన

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 01: మొయినాబాద్ మండలం తోల్కట్ట గ్రామంలో 7 సంవత్సరాల బాలుడి అనుమానాస్పద మృతి కేసు హత్యగా తేలింది. పోలీసులు వేగంగా దర్యాప్తు చేపట్టి కేవలం 24 గంటల్లోనే నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఫిబ్రవరి 27న బాలుడు తన ఇంటి ముందున్న నీటితో నిండిన డ్రమ్‌లో పడి మృతి చెందిన ఘటన గ్రామంలో కలకలం రేపింది. తొలుత ప్రమాదవశాత్తూ జరిగిన మృతిగా కనిపించినా, బాలుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. సంఘటనా స్థల పరిశీలన, సాక్షుల వాంగ్మూలాలు, శవపరీక్ష నివేదిక, సాంకేతిక ఆధారాల సేకరణతో కేసు కీలక మలుపు తిరిగింది. విచారణలో కుటుంబ అంతర్గత విభేదాలు, అక్రమ సంబంధం బయట పడటంతో పగ పెంచుకున్న బంధువులే ఈ దారుణానికి పాల్పడినట్లు బయటపడింది. నిందితులు కనకమామిడి వంశీ, కనకమామిడి అలివేలు కలిసి ముందస్తు పథకం ప్రకారం బాలుడిని హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఫిబ్రవరి 28న నిందితులను అరెస్ట్ చేసి, మార్చి 1న న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా కోర్టు ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును వేగంగా ఛేదించడంలో ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని పోలీసులు కీలక పాత్ర పోషించారు. తోల్కట్ట గ్రామంలో ఈ ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పోలీసులు కేసుపై మరింత దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



ఆర్ఎస్ఎస్ సేవలు అభినందనీయం

అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 01 : దేశభక్తి, సేవాభావం, వ్యక్తిత్వ వికాసం వంటి మహత్తర లక్ష్యాలతో సమాజంలో సంఘ్ చేస్తున్న సేవలను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ అభినందించారు. ఆదివారం ఇందూరులోని గిరిరాజ్ కాలేజ్ మైదానం లో నిర్వహించిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నగర శాఖల సంగమం కార్యక్రమానికి అర్బన్ ఎమ్మెల్యే హాజరయ్యారు. 1925 విజయదశమి పర్వదినాన స్థాపించబడిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్దోత్సవ వేడుకల సందర్భంగా నగరంలోని అన్ని శాఖలను ఒకే వేదికపై సమీకరించి ఈ సంగమ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో ఐక్యత, సోదరభావం, శిస్తు, సేవాస్ఫూర్తి పెంపొందించడంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పాత్ర విశేషమని పేర్కొన్నారు. యువత దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వక్త కల్లూరి ప్రభు కుమార్ ప్రసంగించి సంఘ్ సిద్ధాంతాలు, శతాబ్ద ప్రయాణం, భవిష్యత్ కార్యాచరణపై వివరణ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో 50 బస్తీల శాఖలు పాల్గొన్నాయని ఇందూరు నగరంలో ఆర్ఎస్ఎస్ శాఖ ప్రారంభమై 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా వచ్చే సంవత్సరం జరిగే ఈ కార్యక్రమంలో 75 బస్తీల నుండి శాఖలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. నగరంలోని స్వయంసేవకులు, ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



వాటర్ ప్లాంట్ల ప్రారంభించిన 'నాయిని'

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 1 : వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లను శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. నాయిని విశాల్ ట్రస్ట్,TAVANT TECHNOLOGIES మరియు బాల వికాస్ సంయుక్త ఆధ్వర్యంలో 54వ డివిజన్ పోచమ్మకుంట, 4వ డివిజన్ జ్యోతిబసు నగర్ ప్రాంతాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్లాంట్ లను ఎమ్మెల్యే నాయిని ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల మౌలిక అవసరాల్లో తాగునీరు అత్యంత ముఖ్యమని అన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో స్వచ్ఛమైన నీటి కొరత ఉన్నదని గుర్తించి, ప్రైవేట్ సంస్థల సహకారంతో ఈ శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజారోగ్యం పరిరక్షణలో ఇలాంటి కార్యక్రమాలు కీలకమని ఎమ్మెల్యే న్యాయం రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు.నియోజకవర్గంలో పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు తక్కువ ఖర్చుతో నాణ్యమైన తాగునీరు పొందేలా ఈ ప్లాంట్లు ఉపయోగపడతాయని చెప్పారు. ప్రజలు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, పరిశుభ్రతను పాటించాలని నాయిని పిలుపునిచ్చారు. అడిగిన వెంటనే స్పందించి సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చిన TAVANT Technologies మరియు బాల వికాస్ సభ్యులకు నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలకు తమ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు ప్రజల అవసరాలను గుర్తించి, ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం తమ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే నాయిని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని మరిన్ని ప్రాంతాల్లో కూడా ఇలాంటి మంచినీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమం లో TAVANT సంస్థ చైర్మన్ దేవన శేషా రెడ్డి,బాల వికాస్ సంస్థ డైరెక్టర్ షౌరెడ్డి,యువ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి మరియు ఆయా డివిజన్ ల ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమమే ధ్యేయం

ప్రతిపక్షం, మంచిర్యాల, మార్చి 1 : సంక్షేమ వసతి గృహంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం సంక్షేమం విదభ్యాసానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి భాగ్యవతి తెలిపారు ఆదివారం మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న బాలుర సమీకృత వసతి గృహంపై సందర్శించి విద్యార్థులతో మాట్లాడి భోజన సరఫరా తాగునీరు వసతి వంటశాల ఏర్పాట్లను పరిశీలించారు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తక్షణమే తగు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు విద్యార్థులకు నిరంతరం భోజన సరఫరా శుద్ధమైన తాగునీరు వసతి వంటశాల నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు గతంలో వసతి గృహంపై వెలువడిన కథనాలపై స్పందించడం జరిగిందన్నారు నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై కఠినమైన శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు ఇకపై విద్యార్థుల సంక్షేమ ధ్యేయంగా సంక్షేమ వసతి గృహ అధికారులు పనిచేయాలని ఆదేశించారు.





కామారెడ్డిలో జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కీ వెంకటయ్య పర్యటన

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, మార్చి 1: పిట్లం మండలం, బుర్నాపూర్ , గాంధారి మండలం గండి పేట్ గ్రామాలలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కీ వెంకటయ్య పర్యటించారు. ఈ సందర్భంగా పిట్లం మండలం బుర్నాపూర్ మార్కెట్ యార్డ్ కు చేరుకున్న సందర్భంగా sc st కమిషన్ చైర్మెన్ ను అదనపు కలెక్టర్ విక్టర్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, సంబంధిత అధికారులు పూలమొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం బుర్నాపూర్ గ్రామంలో నెలకొన్న సమస్యల పై ప్రజలతో సమావేశమై వారి సమస్యలు, అభ్యర్థనలు సంక్షేమ కార్యక్రమాల అమలు పై వివరాలు తెలుసుకున్నారు. గ్రామ ప్రజలు తమ సమస్యలను నేరుగా చైర్మన్ కి వివరించగా, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఈ సందర్భంగా బుర్నాపూర్ గ్రామపెద్దలతో మార్చి 9వ తేదీన ఎస్సీ ఎస్టీ కమిషన్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గాంధారి మండలం గండి పేట్ గ్రామం సమగ్ర అభివృద్ధి దిశగా సర్పంచ్ , ఉపసర్పంచ్ సమన్వయంతో కలసికట్టుగా పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ సూచించారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు కావాలంటే పరస్పర సహకారం , సమన్వయం పాటించడం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. గ్రామంలో మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీటి సదుపాయం, రహదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో సర్పంచ్, ఉప సర్పంచ్ లు ఐక్యంగా పని చేసి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. గ్రామ ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి పనులు చేపట్టి గండి పేట్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా నిలపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు DSCDO, DTDO, DPRO, DMO, తహసీల్దార్ లు ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా కృతజ్ఞత సభలో ఎమ్మెల్యే దంపతులు

ప్రతిపక్షం మంచిర్యాల మార్చి 1: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో 59 డివిజన్ లో మాదంశెట్టి సత్యనారాయణ 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానం సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రజా కృతజ్ఞత సభలో ముఖ్య అతిథులుగా మంచిర్యాల్ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆయన సతీమణి కొక్కిరాల సురేఖ దంపతులు ముఖ్యఅతిథిగా ఆదివారం పాల్గొన్నారు ఈ సందర్భంగా వారిని 59వ కార్పొరేటర్ శాలువాలతో సత్కరించారు ఎమ్మెల్యే తో పాటు మంచిర్యాల మేయర్ ధరణి మధుకర్ డిప్యూటీ మేయర్ సల్ల రమ్య లు పాల్గొనగా వారిని సైతం శాలువాలతో సత్కరించడం జరిగింది అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచిర్యాలలో 60 డివిజన్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయనున్నట్లు తెలిపారు మంచిర్యాల కార్పొరేషన్ ప్రజలు తమపై కాంగ్రెస్ పార్టీపై నమ్మకం ఉంచి ఓట్లు వేసి గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో మంచిర్యాల కార్పొరేషన్ కార్పొరేటర్లు కాంగ్రెస్ నాయకులు అభిమానులు పాల్గొన్నారు.





మధ్యవర్తిత్వం వహించేవారిపై ఇరుపార్టీలు విశ్వాసం కలిగి ఉన్నప్పుడే వారి మధ్య ఏర్పడ్డ న్యాయ వివాదాలు త్వరగా పరిష్కారమవుతాయి. ఆర్బిట్రేటర్ల నియామకమూ అలాగే ఉండాలి. సమస్య పరిష్కారానికి పార్టీల మధ్య జరిగిన ఒప్పందాలను వేగంగా, సక్రమంగా అమలు చేసేలా యంత్రాంగమూ ఉండాలి.

- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

ప్రాంతీయం



సంగారెడ్డి మున్సిపల్ పాలకవర్గానికి సన్మానం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 01 : నూతనంగా ఎన్నికైన సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్ , వైస్ చైర్మన్ లతో పాటు పలువురు కౌన్సిలర్ లను పట్కర్ సమాజ్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సమీపం లోని ఎస్ఎస్ కే భవన్ లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చైర్ పర్సన్ కూన వనితా సంతోష్, వైస్ చైర్మన్ షఫీ హఫీజ్ లతో పాటు నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ లు తోపాజీ వీణా హరీష్, శ్రీకాంత్ గౌడ్, సంగీతా మహేష్ ల ను పట్కర్ సమాజ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కాంగ్రెస్ నాయకుడు కూన సంతోష్, పట్కర్ సమాజ్ అధ్యక్షుడు కోనేరీ చందర్, మాజీ ప్రధాన కార్యదర్శి చవాన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

వన దుర్గ మాతను దర్శించుకున్న సొసైటీస్ కమిషనర్ రాహుల్ రాజ్ దంపతులు



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 01 : రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ కమిషనర్ రాహుల్ రాజ్ ఏడుపాయల వన దుర్గ భవాని మాత అమ్మవారి నీ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు ఆలయ కార్యనిర్వహణ అధికారి అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా రిజిస్టర్ కోఆపరేటివ్ సొసైటీ కమిషనర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గ భవాని అమ్మవారి ఆలయం ఎంతో చారిత్రాత్మక ఆలయంగా ప్రసిద్ధికెక్కిందని, భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనానికి విచ్చేస్తారని భక్తుల కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారం గా విరాజిల్లుతుందని మహిమాన్విత వన దుర్గ భవాని అమ్మవారి ఆశీస్సులతో జిల్లాలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా కమిషనర్ ఆకాంక్షించారు.

లైసెన్స్డ్ సర్వేయర్లను నట్టేట ముంచిన సర్కార్

- ఉద్యోగాలు వదిలి వస్తే ఎకరానికి పది రూపాయల కమీషనా?
- కాంగ్రెస్ మాయమాటలు నమ్మి రోడ్డున పడ్డ 6,500 మంది యువత
- గౌరవ వేతనం, ఉద్యోగ భద్రత కల్పించే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది
- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చ్ 01: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాయమాటలు నమ్మి తమ ప్రైవేట్ ఉద్యోగాలు వదులుకుని వచ్చిన లైసెన్స్డ్ సర్వేయర్లను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. ఆదివారం సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లైసెన్స్డ్ సర్వేయర్ల ప్రతినిధులు హరీశ్ రావును కలిసి తమ గోడును వినిపించారు. తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. సర్వేయర్ల ఆవేదనను సావధానంగా విన్న హరీశ్ రావు, వారికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.భూ భారతి పథకం కోసం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 6,500 మంది విద్యావంతులను లైసెన్స్డ్ సర్వేయర్లుగా ఎంపిక చేసి, ఇప్పుడు వారిని రోడ్డున పడేయడం దారుణమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీటెక్ వంటి ఉన్నత విద్యలు అభ్యసించిన యువత ప్రభుత్వంలో మంచి ఉద్యోగం, గౌరవ వేతనం వస్తుందన్న ఆశతో తమ ప్రైవేట్ , ఐటీ ఉద్యోగాలను సైతం వదులుకుని వచ్చారని గుర్తుచేశారు.ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి స్వయంగా మంచి వేతనం ఇస్తామని హామీ ఇచ్చి, శిక్షణలు నిర్వహించి, పరీక్షలు పెట్టి, ప్రమాణ స్వీకారాలు చేయించారని కానీ పనుల్లోకి చేరిన తర్వాత మాట తప్పారని ఆరోపించారు. సర్వే చేసినందుకు ఎకరానికి కేవలం పది రూపాయల కమిషన్ ఇస్తామని చెప్పడం విద్యావంతులను అవమానించడమేనని మండిపడ్డారు. "ఒక ఏడాది పాటు కష్టపడి రెండు వేల ఎకరాలు సర్వే చేసినా కేవలం రూ.20,000 మాత్రమే వస్తే ఇదేనా యువతకు ఇచ్చే ఉపాధి?" అని ప్రశ్నించారు.గత ఏడాది నుంచి సరైన జీతం లేక, పని భద్రత లేక 6,500 మంది సర్వేయర్ల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. కమిషన్ విధానాన్ని పక్కన పెట్టి, ఇచ్చిన హామీ ప్రకారం తక్షణమే గౌరవ వేతనం చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లైసెన్స్డ్ సర్వేయర్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని హరీశ్ రావు స్పష్టం చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని, సర్వేయర్లకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు.



ఘనంగా 'వనితా నీకు వందనం'

- విజయలక్ష్మి జ్ఞాపకార్థం ఉత్తమ మహిళా పురస్కారాలు

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చి1 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రముఖ రచయిత, స్వరకర్త, గాయకుడు విశ్వేశ్వర రావు ఆధ్వర్యంలో "వనితా నీకు వందనం" కార్యక్రమం గజ్వేల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించబడింది. విజయలక్ష్మి జ్ఞాపకార్థం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్య, వైద్యం, సాహిత్యం, సామాజిక సేవ తదితర రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన మహిళలను సత్కరించారు. పురస్కార గ్రహీతలుగా తునికి ఉమారాణి, డాక్టర్ దూబకుంట మంజుల, పెండ్యాల భార్గవి మహేష్, కొత్త ముక్తాబాయి, సుధారాణి కృష్ణంరాజు, శేర్ల నాగలక్ష్మి తదితరులు నిలిచారు. ఆరుగురు మహిళలతో పాటు మరికొంతమందికి సన్మానాలు అందజేశారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా శివాని రోహిత్ వ్యవహరించగా, ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, కళారత్న అవార్డు గ్రహీత శంకర్ నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విశిష్ట అతిథులుగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్మన్ పద్మాబాయి నర్సింగరావు, మాజీ చైర్మన్ రాజమౌళి, 20వ వార్డు కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవ రెడ్డి మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అమూల్యమని, వారు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని కొనియాడారు. గజ్వేల్‌లో సాహిత్య, సాంస్కృతిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విశ్వేశ్వరరావును అభినందించారు. కళారత్న శంకర్ నారాయణ మాట్లాడుతూ "మహిళ లేనిదే మనిషి మనుగడ లేదు" అని పేర్కొంటూ మహిళల గొప్పతనాన్ని వివరించారు. విశ్వేశ్వరరావు మంజుల మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, "అమ్మ లేనిదే మన జీవితం లేదు" అంటూ మాతృమూర్తి విజయలక్ష్మి గారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ సంజయ్ గుప్తా, లయన్ నేతి శ్రీనివాస్, లయన్స్ క్లబ్ సభ్యులు మరియు పలువురు ప్రముఖులు, స్థానికులు పాల్గొన్నారు.



వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చిన్నారులకు స్థానం



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 01 : సంగారెడ్డి జిల్లా కేంద్రం లోని నక్షత్ర స్ఫూర్తి డాన్స్ అకాడమీ నిర్వాహకు రాలు నిర్వాహకురాలు గీతా యజ్ఞశ్రీ శిష్య బృందం నిర్వహించిన 150 మంది కళాకారుల చే కూచిపూడి వైభవం సరస్వతి స్తుతి సామూహిక కార్యక్రమానికి వండల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో చిన్నారులు సామూహికంగా నృత్యం చేసి ఒక రికార్డును నెలకొల్పారు. ఈ కార్యక్రమానికి చిన్నారులకు శిక్షణ ఇచ్చిన గీతా యజ్ఞశ్రీ ని వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్, కోఆర్డినేటర్ రవి కుమార్ మెడల్‌తోపాటూ ధ్రువీకరణ పత్రం అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మాధురి, మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత సంతోష్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వాసవి మా ఇల్లు వ్యవస్థాపక అధ్యక్షులు తోపాజి అనంతకిషన్, పుల్లూరి ప్రకాష్,టి వై యస్ యస్ అధ్యక్షులు కూన వేణు, తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ మైనార్టీ కోఆప్షన్ పోటీలో చోటు ఖాన్.!

- వయసులో చిన్నోడు.. గుణంలో గుణవంతుడు..
- 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చ్ 01 : రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల నగర మోగడంతో ఆందోల్ జోగిపేట మున్సిపల్ కి సైతం ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే జోరు హవా కొనసాగింది. మంత్రి దామోదర రాజనర్సింహ మాటకు కట్టుబడి పార్టీలో పలు సమావేశాలకు చోటు ఖాన్ ముందుండి తన వంతు సేవా కార్యక్రమంలో దూసుకెళ్తున్నాడు.

చోటు ఖాన్ కుటుంబ నేపథ్యం..

మైనార్టీ నిరుపేద కుటుంబంలో పుట్టిన చోటు ఖాన్ చిన్నవాడు వీరు మొత్తం ఐదు మంది అన్నదమ్ములు. వీరిలో రెండవ అతను అన్నయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇంట్లో చిన్నోడు అయినా చోటు కుటుంబ బరువు బాధ్యతలు ఒకవైపు కాంగ్రెస్ పార్టీ బాస్ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించిన బాధ్యతలు మరోవైపు సమర్థవంగా నిర్వహిస్తున్నారు.20 ఏళ్లుగా ఏ పార్టీని కాదని కాంగ్రెస్ నా పార్టీ అని నమ్ముకున్న నిజమైన కార్యకర్త ఎవరంటే చోటు ఖాన్ అని చెప్పవచ్చు. అప్పటి గులాబీ పార్టీ ఇతనిపై బెదిరింపులు కేసులు పెట్టిన చిన్నోడు అదరలేదు. బెదరలేదు ధైర్యమే మా బాసు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అని ఖరా ఖండిగా చెప్తున్నారు. ఆందోల్ జోగిపేట మున్సిపల్ పట్టణంలో 15వ వార్డుకు చెందిన చోటు ఖాన్ తన సొంత వార్డును కూడా కాదని గత 17 వార్డు కాంగ్రెస్ డైనమిక్ కౌన్సిలర్ చిట్టిబాబు తనకు తన అప్పజెప్పిన పనులు అన్ని విధాలుగా చూసుకున్నారు. అప్పటికే 17వ వార్డు కౌన్సిలర్ చిట్టిబాబుతో శభాష్ అనిపించుకున్నారు ఇటు చిట్టితో ఉండి ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో 15వ వార్డు నుండి చిట్టిబాబును భారీ మెజార్టీతో గెలిపించడంలో ఇతని పాత్ర కీలకంగా ఉందని చెప్పవచ్చు. కౌన్సిలర్ చిట్టిబాబు ముద్దుగా తమ్ముడు చోటు ఎక్కడ అనగానే క్షణాల్లో వాలి పోతాడు సేవా కార్యక్రమంలో ముందుండి అన్ని పనులు దిగ్విజయంగా పూర్తి చేస్తారు. చోటు మాత్రం ఇప్పటికీ ఏ చిన్న పోస్ట్ ఆశించలేదు కారణం టాలెంట్ ఉన్న.. ఆర్థిక స్తోమత లేదు. కానీ నాకు మా తండ్రి లాంటి దామోదర్ రాజనర్సింహనే నాకు అండదండ కొండంత బలం అంటున్నాడు.



ఈసారి మైనార్టీ కోటాలో..

ఆందోల్ జోగిపేట మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ హవా కొనసాగింది. ఇక్కడ మున్సిపల్ పాలకవర్గం సైతం కొలువుదీరింది. ఇక మిగిలిన కో ఆప్షన్ల మెంబర్ల కోసం ఎన్నికల అధికారులు కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. కో ఆప్షన్ బరిలో ఉంటున్న చోటు మాత్రం నాకు అవకాశం కల్పించాలని మంత్రి దామోదర రాజనర్సింహకు విజ్ఞప్తి చేస్తున్నాడు. ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీలో గత 20 ఏళ్లుగా ఆర్థిక స్తోమత లేకపోయినా ఏ నాయకుడు గుర్తించకపోయినా తండ్రి లాంటి మంత్రి దామోదర నాకు అండగా ఉన్నాడని నమ్ముకొని పార్టీకి సేవ కార్యక్రమాలు చేస్తూ ఎవరికి ఏ ఆపద వచ్చినా చోటు ఆర్థికంగా తన స్తోమత లేకపోయినా దృఢ సంకల్పంతో ఆపదలో ఉన్నవారికి మంత్రి, వ్యక్తిగత సహాయకులతో పనులు చేయిస్తున్నాడు. ఈసారి మైనారిటీ కోఆప్షన్ పోటీలో నేను ఉన్నాను. నా తండ్రి మంత్రి దామోదర పార్టీని నమ్ముకున్న నిరుపేద కుటుంబానికి చెందిన నాకు కోఆప్షన్ మెంబెర్ గా అవకాశం కల్పిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్న అని చోటు అన్నారు. మరి కోఆప్షన్ మెంబర్ల ఎన్నికల్లో మైనార్టీ యువజన నాయకులు కౌన్సిలర్ చిట్టిబాబు నా తమ్ముడు చోటు ఖాన్ కు కో ఆప్షన్ పదవి అవకాశం మంత్రి దామోదర రాజనర్సింహ కల్పించి వారి కుటుంబంతో పాటు సేవకుడైన చోటుకి కో ఆప్షన్ పదవి ఇచ్చి న్యాయం చేస్తారని మేమందరం ఆశిస్తున్నాం అన్నారు. చోటు కు కో ఆప్షన్ ఇస్తే మాత్రం ఆ పదవికి, మున్సిపల్ అభివృద్ధికి బాటలు వేసేందుకు నా వంతు కృషి చేస్తానని ఆయన చోటు అన్నారు. కన్నతల్లికి చేసిన సేవ లాగే 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న చోటుకు మంత్రి దామోదర రాజనర్సింహ న్యాయం చేయాలని పట్టణ మైనార్టీ నాయకులు కౌన్సిలర్లు కోరుతున్నారు మరి మంత్రి న్యాయం చేస్తాడా లేదా అనేది వేచి చూడాల్సిందే !



మహిళలు ఆర్థికంగా మరింత ఎదగాలి

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అంజిరెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 01 : సంగారెడ్డి జిల్లా భారతి నగర్ డివిజన్లో డీఎం ఎస్ సమృద్ధి సంస్థ ఫౌండర్ డా. అశ్లీషా ఏదల ఏర్పాటు చేసిన డిజిటల్ మార్కెటింగ్ ప్రదర్శనశాల ప్రారంభించిన సంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి. డి ఎం ఎస్ సమృద్ధి సంస్థ మహిళలకు డిజిటల్ మార్కెటింగ్ లో ట్రైనింగ్ ఇస్తు వారి యొక్క ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు చేయడం అభినందించిన విషయం. ఈ సంఘం ఎనిమిది సంఘాలు ఏర్పాటు చేసి హైదరాబాదు పరిసర ప్రాంతాలలో మహిళలకు డిజిటల్ మార్కెటింగ్ ఎలా చేయాలో నేర్పుతూ వారికి ఆర్థికంగా ఎలా ఎదగాలో నేర్పించడం చాలా సంతోషకర విషయం అని అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళలు డిజిటల్ మార్కెటింగ్ ద్వారా ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఎం ఎస్ సంస్థ అధ్యక్షురాలు రమా శ్రీనివాస్, గ్రోత్ ఆఫీసర్ వాసంతి చందా, సుజిత ట్రైనింగ్ ఆఫీసర్ , ట్రెజరర్ అనిత మరియు సభ్యులు జ్ఞానేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వెలమ సంక్షేమ మండలి అభివృద్ధికి కృషి చేస్తా

ప్రతిపక్షం, మంచిర్యాల, మార్చి 1 : మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో గల కాలేజీ రోడ్లోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో వెలమ కులస్తుల సంక్షేమ మండలి అభివృద్ధికి కృషి చేస్తానని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు తెలిపారు ఆదివారం వెలమ కులస్తుల సంక్షేమ మండలి 2025 2026 మండలి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు ఆయనతోపాటు మంచిర్యాల జిల్లా డిసిసి మాజీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వెలమ సంక్షేమ మండలి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో వెలమ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.





రాష్ట్రవ్యాప్తంగా 5వేల మినీ అంగన్వాడీలను పూర్తిస్థాయి కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నాం. మినీ అంగన్వాడీ కార్యకర్తలకు టీచర్లుగా ప్రమోషన్లు, పూర్తి స్థాయి వేతనాలు ఇస్తాం. కొత్తగా 5,000 మంది అంగన్వాడీ సహాయకులను నియమించనున్నాం. వేతనాల పెంపు డిమాండ్‌నూ అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

- ఏపీ హోం మంత్రి అనిత

డీఎంకే అధికార కల.. పీడకలే

- ప్రధాని నరేంద్ర మోడీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 1: తమిళనాడులో ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార డీఎంకేపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. తిరిగి అధికారంలోకి వస్తామని చెబుతున్న డీఎంకేకు అది పీడకలగానే మిగిలిపోతుందని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికలు రాష్ట్రానికి కీలక టర్నింగ్ పాయింట్‌గా మారుతుందని అభిప్రాయపడ్డారు. మదురైలో నిర్వహించిన ఎన్‌డీఏ ర్యాలీలో ఆయన ప్రసంగించారు. తమిళనాడులోని మహిళలు కష్టాల్లో చిక్కుకుపోయారు. రాష్ట్రంలో రోజురోజుకూ క్రైమ్ పెరిగిపోతుంది. ఆల్కహాల్, డ్రగ్ మాఫియాతో తమ కుటుంబాలు నాశనం అవ్వడాన్ని వారుక ళ్లారా చూస్తున్నారు. అమ్మ జయలలిత పాలనలో ఎంత మెరుగ్గా జీవించామో అని వారు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారు. అయితే, ప్రతీ ఒక్క తమిళ తల్లి, సోదరి, కూతురుకి ఒక మాట ఇస్తున్నాను. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటగా రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌పై దృష్టి పెడతాం. డ్రగ్ మాఫియా, క్రిమినల్స్‌ను జైలులో వేస్తాం. మహిళల అభివృద్ధికి, సాధికారతకు ఎన్‌డీఏ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని అని మోదీ అన్నారు. మా పనితీరులో వేగాన్ని ప్రదర్శించాం. అందుకే ఇప్పుడు రైళ్లు కూడా వేగంగా పరిగెడుతున్నాయి. 2009 నుంచి 2014 మధ్య డీఎంకే, కాంగ్రెస్ పాలనలో తమిళనాడుకు రూ. 880 కోట్లు కేటాయించారు. ఒక్క 202627 ఆర్థిక సంవత్సరంలోనే రూ. 7,600 కోట్లు కేటాయించాం. ఇది దాదాపు ఎనిమిది రెట్లు ఎక్కువ." అని ప్రధాని మోదీ అన్నారు.



విశ్వ వీక్షణం



ఇరాన్ కొత్త లీడర్‌గా అయతుల్లా అలీరెజా అరాఫీ

ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా అయతుల్లా అలీరెజా అరాఫీ నియామకమయ్యారు. ఈ మేరకు ఇరాన్ నాయకత్వం ఆయన పేరును ఇరాన్ మధ్యంతర సుప్రీం లీడర్‌గా ప్రతిపాదించింది. ఆయన స్థానికంగా సీనియర్ మత గురువుగానే కాకుండా, గతంలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన స్థానాన్ని భర్తీ చేసేందుకు ఇరాన్ నిర్ణయం తీసుకుంది. అయతొల్లా అరాఫీని మధ్యంతర అధినేతగా నియమించింది. ప్రస్తుతం ఇరాన్‌ను అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్, చీఫ్ జస్టిస్ ఘోలాంహోస్సేన్ మోసేన్ ఆధ్వర్యంలోని కౌన్సిల్ నడిపిస్తోంది. వీరే అరాఫీని సుప్రీం లీడర్‌గా నియమించారు. అరాఫీ బాధ్యతలు, విధుల్ని ఈ కౌన్సిల్ పర్యవేక్షిస్తుంది. అసెంబ్లీ సమావేశమై, ఖమేనీ వారసుడిని ఎన్నుకునేవరకు అరాఫీ నియామకం చెల్లుతుంది. 1959లో జన్మించిన అయతొల్లా అలీరెజా అరాఫీ ఇరాన్‌లో కీలక నేతగా ఉన్నారు. ఆయన మత గురువుగానే కాకుండా గార్డియన్ కౌన్సిల్, అసెంబ్లీ నిపుణుల కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. నేషనల్ నెట్‌వర్క్ ఆఫ్ ఇస్లామిక్ సెమినరీస్‌కు నాయకత్వం వహించారు. విద్యావంతుడు. అరబిక్, ఇంగ్లీష్ మాట్లాడగలడు. సాంకేతిక అంశాలపై కూడా ఆయనకు అవగాహన ఉంది. దీంతో ఆయన అయితేనే ప్రస్తుతం ఇరాన్‌ను నడిపించగలరని నాయకత్వం నమ్మింది. ఇకపై అరాఫీ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు చేపడుతారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చేపట్టిన మొదటి మత గురువు కూడా ఆయనే.



సంతోషం ఒక ప్రయాణం.. గమ్యం కాదు!

మనిషి జీవితంలో సంతోషం అనేది ఒక అందమైన చిక్కుముడి. అది ఎంత సున్నితమైనదో, అంత లోతైనది. లోకంలో ఏ మనిషినైనా అడగండి, జీవితంలో ఏం కావాలి? అని, టక్కున వచ్చే సమాధానం సంతోషం. కానీ, ఇంతకీ సంతోషం అంటే ఏమిటి? దీనికి ఒకే ఒక్క నిర్వచనం చెప్పడం ఎవరికీ సాధ్యం కాదు. ఎందుకంటే, ఒకరి దృష్టిలో సంతోషం అంటే గెలుపు కావొచ్చు, మరొకరికి అది కేవలం ప్రశాంతత కావొచ్చు. పిల్లవాడికి ఇష్టమైన బొమ్మ దొరికితే వచ్చే ఆనందం, కష్టపడి చదివిన విద్యార్థికి ర్యాంకు వచ్చినప్పుడు కలిగే గర్వం, బిడ్డ నోటి వెంట మొదటిసారి అమ్మా అనే పిలుపు విన్నప్పుడు ఆ తల్లి పొందే పరవశం, ఇవన్నీ వేర్వేరు అనుభూతులే. కానీ వీటన్నింటినీ కలిపే ఒకే ఒక్క సూత్రం మదిని నింపే తృప్తి.జీవితంలో సంతోషాన్ని లెక్కించడం అన్నిటికంటే కష్టమైన పని. బజారులో దొరికే వస్తువులకు ఉన్నట్టు

డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ
9490754169



దీనికి కొలమానాలు ఉండవు. ప్రపంచవ్యాప్తంగా సంతోష సూచీలు (Happiness Index) ఎన్ని ఉన్నా, అవి మనిషి మనసులోని అసలు తృప్తిని వంద శాతం పట్టుకోలేవు. సంతోషం అనేది ఒక వ్యక్తిగత ప్రయాణం. అంతేకాదు, సంతోషం అనేది ఒక చోట ఆగిపోయేది కాదు. అది ఎండమావిలా మారుతూ ఉంటుంది. బాహ్య పరిస్థితులు, సామాజిక సంబంధాలు మన మూడ్ని క్షణాల్లో మార్చేస్తుంటాయి. అందుకే ఒక వ్యక్తి సంతోషాన్ని అంచనా వేయాలంటే, కేవలం ఆ క్షణం అతని ముఖం మీద ఉన్న నవ్వుని చూస్తే సరిపోదు, అతని జీవితంలో ఉన్న సమతుల్యతను గమనించాలి. మనిషి పుట్టిన క్షణం నుండి చివరి శ్వాస వరకు చేసే ఏకైక ప్రయాణం, సంతోషం కోసం వెతకడమే. ఇది కాదనలేని నిజం. ఒక పసిబిడ్డ తనకి నచ్చిన బొమ్మ కోసం చేయి చాచడం వెనుక ఉన్నది ఆ చిన్నారి సంతోషమే. ఆ ఆటపాటలే రేపు విద్యార్థిగా కొత్త విషయాలు నేర్చుకోవడంలో ఉత్సాహాన్నిస్తాయి. ఇక యవ్వనంలోకి అడుగుపెట్టగానే ఆ వెతుకులాట కాస్త మారుతుంది అక్కడ ప్రేమ, స్నేహం, గెలుపు కోసం తపన మొదలవుతుంది. వయసు పెరిగే కొద్దీ బాధ్యతలు పెరుగుతాయి.అప్పుడు కుటుంబం బాగుండాలి, సమాజంలో గుర్తింపు రావాలి అనే కోరికల్లో సంతోషాన్ని వెతుక్కుంటాం. చివరికి వృద్ధాప్యంలోకి వచ్చేసరికి ఆ పరుగు ఆగి, కాస్త ప్రశాంతత, జీవితంపై ఒక చిన్న తృప్తి ఉంటే చాలనుకుంటాం. కాలం మారుతుంది, మనిషి మారుతాడు, వెతికే విధానం మారుతుంది, కానీ ఆ సంతోషం కావాలనే కోరిక మాత్రం అస్సలు మారదు. మనం ఎప్పుడూ సంతోషం కోసం ఎందుకు పరితపిస్తాం? దీని వెనుక బలమైన సైన్స్ ఉంది. మనం ఆనందంగా ఉన్నప్పుడు మన మెదడులో డోపమైన్, సెరోటోనిన్ వంటి రసాయనాలు విడుదలవుతాయి. ఇవి మనకు ఒక తెలియని హాయిని ఇస్తాయి. ఆ కిక్కు కోసమే మనం మళ్లీ మళ్లీ ప్రయత్నిస్తుంటాం. నిజానికి, ఇది మనిషి మనుగడ కోసం ప్రకృతి ఏర్పాటు చేసిన ఒక అద్భుతమైన యంత్రాంగం. అందుకే మంచి ఆహారం తిన్నా, నలుగురితో కలిసి ఉన్నా మనకు సంతోషం కలుగుతుంది. అయితే, సంతోషం అంటే కేవలం మెదడులో కలిగే కెమికల్ రియాక్షనేనా? అంటే కాదంటారు మన తత్వవేత్తలు. వేల ఏళ్ల క్రితమే అరిస్టాటిల్ 'యుడేమోనియా' (Eudaimonia) గురించి చెబుతూ,కేవలం ఆనందం మాత్రమే కాదు, విలువలతో కూడిన జీవితం గడపడమే అసలైన సంతోషం అన్నాడు. అటు భారతీయ వేదాంతం ఆనందాన్ని పరమావధిగా చెబితే, బౌద్ధం మాత్రం దుఃఖం లేని నిర్వాణమే అసలైన లక్ష్యమని చాటిచెప్పింది. మనస్తత్వ శాస్త్రం ప్రకారం సంతోషం రెండు రకాలు. ఒకటి హెడోనిక్ అంటే క్షణికమైన ఆనందం, అప్పటికప్పుడు కలిగే తృప్తి. రెండోది యుడేమోనిక్ అంటే అర్థవంతమైన జీవితం గడపడం, మన సామర్థ్యాలను చాటుకోవడం, పదిమందికి సాయపడటం. నిజానికి, ఒక పరిపూర్ణమైన జీవితానికి ఈ రెండూ అవసరమే. అయితే, సంతోషం వెంటే పరుగెత్తడం సరైనదేనా? కొందరు మేధావుల అభిప్రాయం ప్రకారం, సంతోషం అనేది మనం చేరుకోవాల్సిన గమ్యం కాదు, మనం ఎంచుకున్న మార్గానికి లభించే ఫలితం. మన విలువల కోసం బతికినప్పుడు, తోటివారితో మంచి సంబంధాలు ఉన్నప్పుడు సంతోషం అదే వస్తుంది. అలా కాకుండా కేవలం సంతోషం కోసమే వెతికితే, అది చేతికి చిక్కని నీటి బుడగలా తప్పించుకుపోతుంది. దీనినే సైకాలజీలో హెడోనిక్ ట్రెడ్మిల్ అంటారు. అంటే, ఒక సంతోషం దక్కగానే దానికి అలవాటు పడిపోయి, అంతకంటే ఎక్కువ కోసం మళ్ళీ పరుగు మొదలుపెట్టడం. ఈ పరుగులో అసలైన ఆనందాన్ని మనం మిస్ అవుతున్నామేమో ఆలోచించాలి

జీవితం అంటే కేవలం సంతోషంగా ఉండటమేనా? కాదంటారు అనేకమంది తత్వవేత్తలు. మన సంతోషం కంటే నీతి, ధర్మం, సత్యం అనే విలువలు చాలా పెద్దవి. కొన్నిసార్లు సరైన పని చేయడం కోసం మన వ్యక్తిగత ఆనందాన్ని పణంగా పెట్టాల్సి వస్తుంది. దేశం కోసం ప్రాణాలర్పించే సైనికుడు, పిల్లల భవిష్యత్తు కోసం తమ ఇష్టాలను చంపుకునే తల్లిదండ్రులు, అన్యాయంపై పోరాడుతూ కష్టాలు పడే సామాజిక కార్యకర్త, వీరందరి దృష్టిలో వ్యక్తిగత సుఖం కంటే ఉన్నతమైన లక్ష్యాలు ఉన్నాయి. అయితే, సంతోషం కోసం మనిషి ఎంతకైనా తెగిస్తాడా? అనే ప్రశ్న మన నైతికతను నిలదీస్తోంది. దురదృష్టవశాత్తు, చరిత్రలోనూ, నేటి సమాజంలోనూ సొంత లాభం కోసం విలువలను వదిలేసిన వారు ఎందరో ఉన్నారు. ధనం కోసం అవినీతి, అధికారం కోసం హింస, విలాసాల కోసం ఇతరులను కష్టపెట్టడం వంటివి మనం రోజూ చూస్తున్నాం. డ్రగ్స్, జూదం వంటి అలవాట్లు కేవలం ఆ క్షణపు కిక్కు కోసమే తప్ప, అవి జీవితాలను ఎంతలా ఛిన్నాభిన్నం చేస్తాయో పట్టించుకోని తక్షణ ఆనందాలు మాత్రమే. సంతోషం అంటే కేవలం మన గురించి మనం ఆలోచించుకోవడం కాదు. ఇతరులకు హాని చేస్తూ పొందే ఆనందం ఎప్పటికీ నిజమైన సంతోషం అనిపించుకోదు. నిజానికి, ఎదుటివారికి సాయం చేయడంలోనే అసలైన సంతృప్తి ఉంటుందని మనస్తత్వశాస్త్రం కూడా చెబుతోంది. దీనినే 'హెల్పర్స్ హై' (Helper's High) అంటారు. అంటే, మనం ఒకరికి సాయం చేసినప్పుడు మన మనసులో కలిగే ఒక తెలియని ఉత్సాహం, ప్రశాంతత. సంతోషం విషయంలో ఒక్కో దేశానిది ఒక్కో శైలి. పాశ్చాత్య దేశాలు వ్యక్తిగత ఆనందానికి పెద్దపీట వేస్తే, మన భారతీయ సంస్కృతి మాత్రం సామూహిక శ్రేయస్సు కే ప్రాధాన్యత ఇస్తుంది. మనకు కుటుంబం బాగుండాలి, సమాజం బాగుండాలి. అందుకే మన ప్రార్థనల్లో కూడా నేను బాగుండాలి అని కాకుండా, సర్వే భవంతు సుఖినః అందరూ సుఖంగా ఉండాలి అని కోరుకుంటాం. ఈ లోకమంతా బాగున్నప్పుడే మనకూ నిజమైన సంతోషం దక్కుతుందని మన సంస్కృతి మనకు నేర్పిన గొప్ప పాఠం.

నేటి యాంత్రిక జీవనంలో సంతోషం అనేది ఒక అద్భుతంలా మారిపోయింది. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల వెల్లువలో మన ఆనందం మన చేతుల్లో లేకుండా పోతోంది. పక్కవారి ఫేస్బుక్ పోస్టులు, ఇన్స్టాగ్రామ్ రీల్స్ చూసి,మనకంటే వారే ఎక్కువ హాయిగా ఉన్నారని మనసు పాడుచేసుకోవడం ఒక వ్యాధిలా మారుతోంది. విజయాన్ని కేవలం సంపాదనతో, హోదాతో ముడిపెట్టి చూడటం వల్ల, ఎంత సాధించినా ఇంకా ఏదో తక్కువైందనే నిరాశే మిగులుతోంది. భౌతిక సుఖాల వెంటే పరుగెత్తడం వల్ల అసలైన మానసిక ప్రశాంతతకు మనం దూరమవుతున్నాం. ఆదాయం పెరిగితే సంతోషం పెరుగుతుందనేది నిజమే కావచ్చు. కానీ దానికి కూడా ఒక పరిమితి ఉందని పరిశోధనలు చెబుతున్నాయి. ఒక స్థాయి దాటాక డబ్బు కంటే మన చుట్టూ ఉన్న మనుషులు, మన ఆరోగ్యం, మనం చేసే పనిలో దొరికే సంతృప్తి మాత్రమే మనల్ని సంతోషంగా ఉంచుతాయి. కేవలం సంపాదన కోసమే కాకుండా, కృతజ్ఞతగా ఉండటం, ధ్యానం, వ్యాయామం, సృజనాత్మక పనుల కోసం సమయం కేటాయించడం వల్ల మన మనసుకి తెలియని ప్రశాంతత లభిస్తుంది. గుర్తుంచుకోండి, సంతోషం అనేది మనం చేరుకోవాల్సిన గమ్యం కాదు, అది మన జీవన ప్రయాణం. జీవితం అన్నాక ఎత్తుపల్లాలు, కష్టసుఖాలు సహజం. మనం ఎప్పుడూ ఒకేలా సంతోషంగా ఉండటం అసాధ్యం. కానీ ఎదురయ్యే పరిస్థితులకు మనం ఎలా స్పందిస్తున్నాం, ఏ విలువలకి ప్రాధాన్యత ఇస్తున్నాం, ఎలాంటి బంధాలను పెంచుకుంటున్నాం. అన్నదే మన జీవితానికి అసలైన అర్థాన్ని ఇస్తుంది. మన దుఃఖానికి అసలు కారణం మితిమీరిన కోరికలే అని బౌద్ధం ఎప్పుడో చెప్పింది. వస్తువుల మీదో, మనుషుల మీదో మనం విపరీతమైన ఇష్టాన్ని పెంచుకుంటాం, తీరా అవి దూరమైనప్పుడు తట్టుకోలేక కుంగిపోతాం. చివరికి సంతోషంగా ఉండాలి అనే కోరిక కూడా ఒక బంధనమే! అది దక్కనప్పుడు కలిగే వేదనే ఎక్కువ. అందుకే స్టోయిక్ తత్వవేత్తలు ఒక చక్కని మాట చెప్పారు, నీ చేతుల్లో ఉన్న పని మీద మాత్రమే దృష్టి పెట్టు, బయట ఏం జరుగుతుందో అని కంగారు పడి నీ మనశ్శాంతిని పాడుచేసుకోకు. ఈ మాటలు నేటి ఉరుకుల పరుగుల జీవితానికి అక్షర సత్యాలు.

జీవితంలో ఏదైనా సమతుల్యంగా (Balance) ఉన్నప్పుడే అందం. మన సంతోషం మనకు ముఖ్యం, కానీ అది ఎదుటివారిని ఇబ్బంది పెట్టకూడదు. లక్ష్యాలను చేరుకోవాలి, అలాగని సామాజిక బాధ్యతలను వదిలేయకూడదు. అప్పటికప్పుడు కలిగే చిరునవ్వులను ఆస్వాదిస్తూనే, జీవితానికి ఒక అర్థాన్నిచ్చే పనుల మీద దృష్టి పెట్టాలి. అప్పుడే భౌతిక సుఖాలు, మానసిక ప్రశాంతత రెండూ మన సొంతమవుతాయి. సంతోషం అంటే ఏమిటో ఎవరికి వారు స్వయంగా నిర్వచించుకోవాల్సిందే. సమాజపు అంచనాలు, ఇతరుల కోరికలు, లోకం విధించే నియమాలు మనల్ని ప్రభావితం చేయవచ్చు. కానీ నిజమైన ఆనందం బయట ఎక్కడో ఉండదు. అది మన అంతరంగంలో మనం కనుగొనే శాంతిలో, తృప్తిలో ఉంటుంది. మన బతుకుకి ఒక అర్థం దొరికినప్పుడు, మన విలువలకు కట్టుబడి జీవిస్తున్నప్పుడు, మన వాళ్లతో మనసు విప్పి మాట్లాడుతున్నప్పుడు, సంతోషం మన వెంటే ఉంటుంది. మనలో ఉన్న సృజనాత్మకతకు పదును పెడుతూ సాగిపోయే ప్రయాణమే మనల్ని అసలైన సంతోషానికి దగ్గరగా తీసుకెళ్తుంది.

జీవితంలో సంతోషం అనేది ఒక ముఖ్యమైన లక్ష్యమే కావచ్చు, కానీ అదే సర్వస్వం కాదు. నీతి, ధర్మం, సత్యం, ప్రేమ, కరుణ, ఇవన్నీ మనిషి ఉనికికి ప్రాణవాయువు లాంటివి. కేవలం మన సంతోషం కోసం ఈ విలువలను వదులుకుంటే, ఆ వచ్చే ఆనందం ఎంతో కాలం నిలవదు. నిజానికి, ఈ విలువల బాటలో నడవడమే అసలైన, శాశ్వతమైన సంతోషానికి రాజమార్గం. మన సంతోషాన్వేషణ కేవలం మన ఒక్కరికే పరిమితం కాకూడదు, మనతో పాటు ఎదుటివారు కూడా బాగుండాలని కోరుకున్నప్పుడే ఆ సంతోషానికి పరిపూర్ణత వస్తుంది. నలుగురితో కలిసి పంచుకునే ఆనందంలోనే మన జీవితానికి ఒక అర్థం, పరమార్థం దొరుకుతాయి.



ఖమేని హత్యను ఖండించిన పుతిన్


ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ హత్యను రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఖండించారు. ఖమేనీ హత్య నిరంకుశ చర్యగా అభివర్ణించారు. ఈ మేరకు ఆదివారం పుతిన్ ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఖమేనీ హత్య నిరంకుశమైంది. నైతిక విలువలు, అంతర్జాతీయ చట్టాలు ఉల్లంఘించి హత్య చేశారు. ఖమేనీ కుటుంబానికి, ఆయన సన్నిహితులకు నా ప్రగాఢ సానుభూతి. రష్యా ఎప్పుడూ ఖమేనీని గుర్తుంచుకుంటుంది. ఆయన తన అద్భుతమైన పాలనతో ఇరుదేశాల మధ్య సంబంధాల పెంపునకు కృషి చేశారు'' అంటూ పుతిన్ పేర్కొన్నారు. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌కు పుతిన్ తన సంతాప సందేశాన్ని పంపించారు. ఖమేనీ హత్యను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఇజ్రాయెల్, అమెరికా దాడిపై మాత్రం పుతిన్ స్పందించలేదు. అయితే, ఈ చర్యలు ఈ ప్రాంతంలో తీవ్ర సంక్షోభానికి, సంఘర్షణకు దారి తీయొచ్చని, అణు యుద్ధానికి దారి తీసే అవకాశం ఉందని సీనియర్ రష్యా దౌత్యవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మోడీ సర్కారు వల్లే

భారత్ మూల్యం చెల్లించాల్సి వస్తోంది

- తీవ్రంగా మండిపడ్డ కాంగ్రెస్ నేత జైరాం రమేశ్


ప్రతిపక్షం నేషనల్ బ్యూర్, న్యూఢిల్లీ, మార్చి 1: మోదీ సర్కారు విదేశాంగ విధానం విఫలమవుతున్నందుకు, మన దేశం భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వస్తోందని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న దాడులపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం, భారతదేశ విలువలు, సూత్రాలు, ప్రయోజనాలకు ద్రోహం చేయడమేనని పేర్కొంది. ఇరాన్‌పై దాడికి అమెరికా, ఇజ్రాయెల్ సిద్ధమవుతున్న వేళ, ఫిబ్రవరి 25, 26 తేదీల్లో ఇజ్రాయెల్‌లో పర్యటించి ప్రధాని మోదీ పెద్ద తప్పు చేశారని హస్తం పార్టీ మండిపడింది. ఈమేరకు కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇంఛార్జి జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా ఒక ట్వీట్ చేశారు. ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటన ముగిసిన సరిగ్గా రెండు రోజుల తర్వాత ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేశాయని ఆయన గుర్తుచేశారు.



ఇటువంటి పరిస్థితుల్లో ఇజ్రాయెల్ పార్లమెంటు (నెస్సెట్)లో ప్రధాని మోదీ ప్రసంగించి, పిరికితనంతో నైతికతకు నీళ్లు వదిలిన విషయాన్ని యావత్ ప్రపంచానికి చాటుకున్నారని జైరాం రమేశ్ ధ్వజమెత్తారు. "తనను తాను విశ్వగురువుగా ప్రకటించుకున్న ప్రధాని మోదీ గురించి ఇప్పుడు అందరికీ పూర్తిగా తెలిసిపోయింది. ప్రధాని మోదీ అనుసరించిన విదేశాంగ విధానంపైనా అందరికీ క్లారిటీ వచ్చేసింది. కానీ ప్రధాని సారథ్యంలోని కొందరు చీర్ లీడర్లకు ఇదేమీ అర్థం కావడం లేదు. ఇరాన్‌లోని కీలక వ్యక్తుల హత్యల కోసం ఇజ్రాయెల్, అమెరికా నిర్వహించిన దాడులపై మోదీ సర్కారు స్పందించకపోవడం అనేది భారతదేశ విలువలు, సూత్రాలు, ప్రయోజనాలకు ద్రోహం చేయడమే" అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

పశ్చిమాసియా దేశాల్లో.. సీబీఎస్ఈ పరీక్షలు వాయిదా

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 1: అమెరికాఇరాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో పలు పశ్చిమాసియా దేశాలలో మార్చి 2న జరగాల్సిన పరీక్షలను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) వాయిదా వేసింది. మార్చి 2న జరగాల్సిన 10, 12 తరగతుల బోర్డు పరీక్షలను వాయిదా వేసినట్లు సీబీఎస్ఈ ఆదివారం ప్రకటించింది. పరీక్ష నిర్వహించే కొత్త తేదీలను త్వరలో తెలియజేస్తామని పేర్కొంది. మార్చి 3న సమీక్ష తర్వాత మార్చి 5 నుంచి జరుగాల్సిన మిగతా పరీక్షల నిర్వహణపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది. బహ్రెయిన్, ఇరాన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని 150కు పైగా సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలల ప్రిన్సిపాల్‌లకు ఈ సమాచారం పంపినట్లు పేర్కొంది.



శభాష్.. శాంసన్

• వెస్టిండీస్ పై విజయం.. సెమీస్ కు భారత్

భారత క్రికెట్ అభిమానుల ఉత్కంఠకు తెర! టీ20 ప్రపంచకప్‌లో సెమీస్ చేరాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో టీమ్ఇండియా బ్యాట్ తో అదరగొట్టింది. బంతితో అంచనాలను అందుకోలేకపోయినా బ్యాట్‌తో మాత్రం సత్తాచాటింది. భారత క్రికెట్ మక్కాగా పిలుచుకునే ఈడెన్ గార్డెన్స్‌లో వర్చువల్ నాకౌట్‌గా సాగిన పోరులో వెస్టిండీస్‌ను 5 వికెట్ల తేడాతో చిత్తుచేసి సెమీస్‌కు అర్హత సాధించింది. విండీస్ నిర్దేశించిన 196 పరుగుల భారీ ఛేదనలో వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ (50 బంతుల్లో 97 నాటౌట్, 12 ఫోర్లు, 4 సిక్సలు) తన కెరీర్‌లోనే అత్యంత విలువైన ఇన్నింగ్స్ ఆడి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అతడి మెరుపులతో ఛేదనను సూర్య సేన..19.2 ఓవర్లలో 5 వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది. శాంసన్‌కే 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. అంతకుముందు భారత ఆహ్వానం మేరకు మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ సమష్టిగా ఆడి 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 రన్స్ చేసింది. రోస్టన్ ఛేజ్ (25 బంతుల్లో 40, 5 ఫోర్లు, 1 సిక్స్), జేసన్ హోల్డర్ (22 బంతుల్లో 37 నాటౌట్, 2 ఫోర్లు, 3 సిక్సలు), రోవ్‌మన్ పావెల్ (19 బంతుల్లో 34 నాటౌట్, 3 ఫోర్లు, 2 సిక్సలు), షై హోప్ (32) రాణించారు. ఈ ఓటమితో విండీస్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఛేదనలో అభిషేక్ (10) మరోసారి స్పిన్ ఉచ్చులో చిక్కుకుని నిరాశపరచగా హోల్డర్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడబోయిన ఇషాన్ కిషన్ (10) సైతం అతడినే అనుసరించాడు. ఈ క్రమంలో సంజూ, కెప్టెన్ సూర్య (18) జట్టును ఆదుకున్నారు. 11వ ఓవర్లో బంతినందుకున్న జోసెఫ్.. సూర్యను ఔట్ చేసి 58 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. 1012 ఓవర్ల మధ్య స్కోరు వేగం నెమ్మదించడంతో పాటు ఛేదించాల్సిన రన్‌రేట్ పెరుగుతుండటంతో సంజూ, సూర్య స్థానంలో వచ్చిన తిలక్ గేర్ మార్చారు. జోసెఫ్ ఓవర్లో తిలక్ హ్యాట్రిక్ ఫోర్లు బాదాడు. ధాటిగా ఆడే క్రమంలో తిలక్.. డ్రింక్స్ విరామం తర్వాత హెట్‌మెయర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అయితే అప్పటికే క్రీజులో పాతుకుపోయిన సంజూ.. హార్దిక్ పాండ్య (17), శివమ్ దూబె (8*) అండతో జట్టును విజయతీరాలకు చేర్చాడు.

సెమీస్‌లో ఇలా..

భారత్, వెస్టిండీస్ మ్యాచ్‌తో ప్రపంచకప్‌లో సూపర్ 8 దశకు శుభం కార్డు పడింది. గ్రూప్ 1 నుంచి దక్షిణాఫ్రికా, భారత్.. గ్రూప్ 2 నుంచి ఇంగ్లండ్, న్యూజిలాండ్ సెమీస్ చేరాయి. గ్రూప్ 2 నుంచి పాక్ నిష్క్రమించడంతో రెండు సెమీస్ మ్యాచ్‌లతో పాటు ఫైనల్ కూడా భారత్‌లోనే జరుగనుంది. మార్చి 4న సౌతాఫ్రికా.. కోల్‌కతా వేదికగా న్యూజిలాండ్‌తో తలపడనుండగా ఆ మరుసటి రోజున ఇంగ్లండ్.. ముంబైలో టీమ్ఇండియాతో అమీతుమీ తేల్చుకోనుంది. సెమీస్‌లో గెలిచిన జట్లు ఈనెల 8న అహ్మదాబాద్‌లో టైటిల్ పోరులో తలపడతాయి.



అభిషేక్ మళ్లీ ఫెయిల్

ప్రపంచకప్‌లో వరుసగా నిరాశపరుస్తున్న ఓపెనర్ అభిషేక్ శర్మ(10) మళ్లీ విఫలమయ్యాడు. జింబాబ్వేపై అర్ధ శతకంతో ఫామ్ అందుకున్నట్టే కనిపించిన ఈ లెఫ్ట్ హ్యాండర్.. వెస్టిండీస్‌పై సులువగా వికెట్ ఇచ్చేశాడు. అకీల్ హొసేన్ ఓవర్లో బ్యాక్‌ఫుట్‌లో బంతిని బౌండరీ తరలించాలనుకున్న అభిషేక్ అంచనా తప్పాడు. ఇంకేముంది గాల్లోకి లేచిన బంతిని హిట్‌మైర్ ఒడుపుగా అందుకున్నాడు. కాసేపటికే హోల్డర్ ఓవర్లో ఫోర్‌తో అలరించిన ఇషాన్ కిషన్(10) సైతం బౌండరీ లైన్ వద్ద హిట్‌మైర్‌కు చిక్కాడు. దాంతో.. 41 వద్ద భారత్ రెండో వికెట్ పడింది. వెస్టిండీస్ నిర్దేశించిన భారీ ఛేదనలో భారత పవర్ ప్లేలోనే రెండు బిగ్ వికెట్లు కోల్పోయింది. ఫామ్‌లోకి వచ్చినట్టే అనిపించిన అభిషేక్ శర్మ(10) పేలవ షాట్‌తో పెవిలియన్ చేరాడు. అకీల్ హొసేన్ వేసిన తొలి ఓవర్లో ఏమాత్రం తొందరపడని అభిషేక్.. చివరకు అతడి ఉచ్చులో పడ్డాడు. అంతకుముందు సంజూ శాంసన్(24) లెగ్ సైడ్ రెండు భారీ సిక్సర్లు.. సంధించాడు. అభిషేక్ సైతం పెద్ద షాట్‌కు యత్నించి.. హిట్‌మైర్ చేతికి దొరికాడు. ఆ తర్వాత వస్తూనే రెండు ఫోర్లతో అలరించిన ఇషాన్ కిషన్(10)ను హోల్డర్ బోల్తా కొట్టించాడు. ప్రస్తుతం సంజూకి జతగా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(3) ఆడుతున్నాడు. పవర్ ప్లే చివరి ఓవర్లో శాంసన్ బౌండరీతో స్కోర్ 50 దాటింది. 6 ఓవర్లు పూర్తయ్యే సరికి స్కోర్.. 532 .



మూడో వన్డేలోనూ ఓడిన భారత్

• సిరీస్ క్లీన్ స్వీప్ చేసిన ఆస్ట్రేలియా

స్వదేశంలో భారత్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను ఆస్ట్రేలియా మహిళా క్రికెట్ జట్టు క్లీన్‌స్వీప్ చేసింది. వరల్డ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం వరుసగా మూడో వన్డేలోనూ ఓడి దారుణ పరాభవాన్ని మూటగట్టుకుంది. తన కెరీర్‌లో చివరి మ్యాచ్ ఆడిన ఆసీస్ సారథి అలిస్సా హీలి (98 బంతుల్లో 158, 27 ఫోర్లు, 2 సిక్సలు) భారీ శతకంతో రాణించగా బెత్ మూనీ (84 బంతుల్లో 106 నాటౌట్, 10 ఫోర్లు, 1 సిక్స్), జార్జియా వోల్ (62) రాణించారు. ఫలితంగా ఆ జట్టు 50 ఓవర్లకు 7 వికెట్ల నష్టానికి 409 పరుగుల రికార్డు స్కోరు సాధించింది. బౌండరీల వర్షం కురిపించిన హీలి.. వోల్, మూనీతో కలిసి శతాధిక భాగస్వామ్యాలు నెలకొల్పడంతో ఆ జట్టు ప్రత్యర్థి ఎదుట భారీ లక్ష్యాన్ని నిలుపగలిగింది. లక్ష్యఛేదనలో భారత జట్టు ఏ దశలోనూ ఆ దిశగా సాగలేదు. మరోసారి బ్యాటింగ్ వైఫల్యంతో 45.1 ఓవర్లలో 224 రన్స్‌కే కుప్పకూలి 185 పరుగుల తేడాతో భారీ ఓటమిని చవిచూసింది. స్నేహ్ రాణా (44), జెమీమా రోడ్రిగ్స్ (42) ఉన్నంతలో కాస్త ఫర్వాలేదనిపించారు. వన్డే సిరీస్ ముగియడంతో ఇరుజట్ల మధ్య ఈనెల 6 నుంచి పెర్త్‌లో ఏకైక టెస్టు జరుగనుంది.





డబ్బింగ్ చెబుతున్న 'పెద్ది'

స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదల చేసిన చికిరి చికిరి సాంగ్ ఇండియాతోపాటు వరల్డ్‌వైడ్‌గా మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తోంది. కాగా మేకర్స్ ఇక సెకండ్ సింగిల్ 'రై రై రా రా' సాంగ్‌ను రేపు లాంచ్ చేయనుండగా అభిమానులు ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే రాంచరణ్ ఊహించని సర్‌ప్రైజ్ ఒకటి సోషల్ మీడియా ద్వారా అభిమానులతో షేర్ చేసుకున్నాడు. అయితే ఈ సారి సాంగ్ గురించి కాకుండా సినిమాకు డబ్బింగ్ చెబుతున్న విషయాన్ని షేర్ చేశాడు. స్టూడియోలో డబ్బింగ్ చెబుతున్న వీడియో క్లిప్ ఒకటి షేర్ చేయగా.. డైరెక్టర్ బుచ్చిబాబు రాంచరణ్‌కు డైలాగ్స్ వివరిస్తుండటం చూడొచ్చు. ఇప్పుడీ వీడియో నెట్టింట హల్ చల్ చేస్తూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. పాన్ ఇండియా రూరల్ స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. పెద్ది ఏప్రిల్ 30న 2026న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ మూవీలో జగపతిబాబు, దివ్యేందు శర్మ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. పెద్ది చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి.



ఏప్రిల్ 30న వస్తున్న 'కారా'

తమిళ స్టార్ నటుడు ధనుష్, 'పోర్ తోజిల్' ఫేమ్ విఘ్నేష్ రాజా కాంబినేషన్‌లో వస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ 'కారా' విడుదల తేదీ ఖరారైంది. భారీ యాక్షన్ ఎంటర్టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 30, 2026న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. వేల్స్ యూనివర్సిటీలో జరిగిన 'వేల్స్ నక్షత్ర 2026' వేడుకల్లో నిర్మాత ఐషారి కె. గణేష్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధనుష్‌తో 'వడ చెన్నై 2' చేయడం తన డ్రీమ్ ప్రాజెక్ట్ అని, ప్రస్తుతానికి 'కారా' సినిమాను ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సినిమాలో ధనుష్ 'కరసామి' అనే పత్తి రైతు పాత్రలో కనిపించబోతున్నాడు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ ఎమోషనల్ సస్పెన్స్ థ్రిల్లర్‌లో ధనుష్ లుక్ చాలా ఇంటెన్సివ్‌గా ఉండబోతోంది. మలయాళ బ్యూటీ మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తుండగా.. జయరామ్, కె.ఎస్. రవికుమార్, సూరజ్ వెంజారమూడు, కరుణాస్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత జి.వి. ప్రకాష్ కుమార్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండగా, తేని ఈశ్వర్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపడుతున్నారు. గతంలో 'పోర్ తోజిల్' వంటి సూపర్ హిట్ థ్రిల్లర్‌ను అందించిన విఘ్నేష్ రాజా - ఆల్ఫ్రెడ్ ప్రకాష్ ద్వయం ఈ చిత్రానికి కథను అందించారు.

టీజర్ తోనే అదరగొట్టిర 'రాకాస'

యువ నటుడు సంగీత్ శోభన్ కథానాయకుడిగా, మానస శర్మ దర్శకత్వంలో రూపొందుతున్న సరికొత్త ఫాంటసీ కామెడీ డ్రామా 'రాకాస' చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్ సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ మరియు జీ స్టూడియోస్ బ్యానర్లపై మెగా డాటర్ నిహారిక కొణిదెల అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో 'ఆయ్' సినిమా ఫేమ్ నయన్ సారిక కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించిన ఈ సినిమాకు సంబంధించి ఆదివారం చిత్ర యూనిట్ అధికారికంగా టీజర్‌ను విడుదల చేసింది.ఈ టీజర్ విభిన్నమైన విజువల్స్ మరియు వినోదభరితమైన అంశాలతో సినిమాపై అంచనాలను పెంచుతోంది. చిత్రంలో వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, తనికెళ్ల భరణి వంటి దిగ్గజ నటులు కీలక పాత్రలు పోషిస్తుండటంతో ఈ ఫాంటసీ డ్రామాలో కామెడీ డోస్ భారీగా ఉండబోతోందని అర్థమవుతోంది. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ మూవీ నిర్మాణానంతర పనులను కూడా సమాంతరంగా పూర్తి చేసుకుంటోంది. వినూత్న కథాంశంతో వస్తున్న ఈ 'రాకాస' చిత్రాన్ని వేసవి కానుకగా ఏప్రిల్ 03వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నద్ధమవుతున్నారు.



Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200